Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

V A S BHASKAR
+91 9063233197
yas.bhaskar@yahoo.co.in
EPF
ESIC
LABOUR OFFICE
PSARA LICENCES
CLIENT AUDITS
SECURITY SERVICES
PAYROLL

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 166 విశాఖపట్నం, 12 ఏప్రిల్ 2024 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ఉగ్రవాదం మీరు నిర్మూలించలేకపోతే ఆ పని మాకప్పగించండి

### - పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ సవాల్




**ఢిల్లీ:** సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది పాకిస్థాన్‌పై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి విరుచుకుపడ్డారు. ముష్కరమూకలతో భారత్‌ను అస్థిర పరిచేందుకు ప్రయత్నిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో దాయాది అసమర్థతను ఎద్దేవా చేశారు. అది తమకు చేతకాదని పాక్ భావిస్తే, ఆ దేశానికి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు.

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ నాటి రోజులను గుర్తుచేసుకుంటూ ప్రతిపక్ష కాంగ్రెస్‌పై ఆయన

(మిగతా 2లో)

## ఇప్పటి వరకు 100 కోట్లకు పైగా నగదు దొరికింది: రాష్ట్ర ఎన్నికల అధికారి మీనా

### ఏపీలో భారీగా పట్టుబడుతున్న నగదు, మద్యం, మాదకద్రవ్యాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఒకేసారి శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అడుగడున చెక్‌పోస్టులు పెట్టి ఓటర్ల ప్రలోభాలకు గురి చేసిన వారిపై నిఘా పెట్టింది ఈక్రమంలో భారీగా నగదు, లిక్కర్, డ్రగ్స్ జప్తు చేసింది. స్వాధీనం చేసుకున్న వాటిలో నగదు, విలువైన వస్తువులు, మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర వస్తువులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన నాటి నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా రూ.100 కోట్ల విలువకు పైబడి నగదు, లిక్కర్, డ్రగ్స్, ప్రెషస్




మెటల్స్, ఫ్రీ బీస్, ఇతర వస్తువులను జప్తు చేసింది ఎన్నికల కమిషన్. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపర్చే నగదు, లిక్కర్, డ్రగ్స్, ప్రెషస్ మెటల్స్, ఇతర వస్తువుల అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘాను పెంచిన ఎన్నికల సంఘం, అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రంలోని పలు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేస్తోంది. పోలీస్, ఎక్సైజ్, ఇన్కమ్ ట్యాక్సు, ఫారెస్టు, ఇడి, ఎన్సీబి, ఆర్పిఎఫ్, కస్టమ్స్ తదితర 20 ఎన్‌ఫోర్సుమెంట్ ఏజన్సీలకు పైబడి ఓటర్లను ప్రభావింతం చేసే వస్తువులపై నిరంతరం నిఘా కాస్తుంది.

ఫలితంగా ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తదుపరి నుండి రాష్ట్రవ్యాప్తంగా రూ.100 కోట్ల విలువకు పైబడి నగదు, లిక్కర్, డ్రగ్స్, ప్రెషస్ మెటల్స్, ఫ్రీ బీస్, ఇతర

(మిగతా 2లో)

## రంజాన్ వేడుకల్లో టోపీ ధరించిన చంద్రబాబు

నిడదవోలు: వైకాపా అధికారంలోకి వచ్చాక మైనార్టీలపై ఎన్నో దాడులు జరిగాయని తెదేపా అధినేత చంద్ర బాబు అన్నారు. రాష్ట్రంలో ఎవరికీ రక్షణ లేదని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కఠోర క్రమశిక్షణతో ముస్లింలు రంజాన్ దీక్ష చేస్తారన్నారు. నిడదవోలులో వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని



చెప్పారు. తెదేపా ప్రభుత్వ హయాంలో హైదరాబాద్, కర్నూలులో ఉర్దూ యూని వర్సిటీలు ఏర్పాటు చేశామని చంద్రబాబు గుర్తు చేశారు. కడప, విజయవాడలో హజ్ హౌస్ నిర్మించి యాత్రకు ఆర్థిక సహకారం అందించామన్నారు. రంజాన్ తోఫా ఇచ్చామని చెప్పారు. ముస్లింల వివాహానికి దుల్హన్ పథకం కింద ఆర్థిక సాయం అందజేశామని వివరించారు. మైనార్టీలకు జగన్ ఏమిచ్చారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

"ముస్లిం విద్యార్థులకు ప్రపంచంలో ఎక్కడైనా చదువుకునే అవకాశం ఇచ్చాం. విదేశీ చదువుల కోసం రూ. 15లక్షలు ఇస్తే, జగన్ ఆ పథకం ఆపేశారు. కడపలో హజ్ హౌస్ నిర్మాణం 90

(మిగతా 2లో)

## ఉగ్రవాదాన్ని పోషించే రాష్ట్రాలకు ప్రధాని తీవ్ర హెచ్చరిక

రిషికేష్: విపక్షాలపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దేశంలో బలహీన, అస్థిర ప్రభుత్వాలు ఉంటే శత్రువులకు అవకాశంగా మారుతోందని గుర్తుచేశారు. ఉగ్రవాద సామ్రాజ్యం బలపడుతోందని వివరించారు. అలాంటి పరిస్థితి ఉండొద్దని పేర్కొన్నారు. గత యూపీఏ హయాంలో నెలకొన్న పరిస్థితులను గురించి మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పేకలిస్తోందని స్పష్టం చేశారు. ఇంట్లో ఉన్న ఉగ్రవాదులను కూడా భద్రతా దళాలు హతమార్చాయని



వివరించారు. ప్రధాని మోదీ గురువారం నాడు రిషికేష్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

**దశాబ్దాల తర్వాత**

ఆరు దశాబ్దాల తర్వాత జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేశామని ప్రధాని మోదీ వివరించారు. ట్రిపుల్ తలాక్ చట్టాన్ని రద్దు చేశామని పేర్కొన్నారు. లోక్ సభ స్థానాలు, అసెంబ్లీ స్థానాల్లో మహిళ నేతలకు రిజర్వేషన్ కల్పించామని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగితే వన్ ర్యాంక్ వన్ పెన్షన్ అమల్లోకి వచ్చేది కాదని వివరించారు. మాజీ సైనిక ఉద్యోగులకు రూ.500 కోట్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటన చేసింది. తమ ప్రభుత్వం ఇప్పటికే రూ.1 లక్ష కోట్లను

(మిగతా 2లో)

## గాజువాక నియోజకవర్గంలో అమర్నాథ్ ప్రచారం



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** 'జగన్మోహన్ రెడ్డి సైన్యంలో సైనికుడు' అంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. స్థానిక 76 వార్డు ఇన్చార్జి దొడ్డి రమణ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మహిళలు ఆయనకు నీరాజనాలు పలికారు. కనీవినీ ఎరుగని రీతిలో మహిళలు వచ్చి అమర్నాథ్‌కు జై కొడుతూ అలుపెరగక ఆయన వెంట నడిచారు. ఒకవైపు జగన్ మోహన్ రెడ్డి మీద అభిమానం, మరొకవైపు అమర్నాథ్ గెలిపించాలన్న లక్ష్యం మహిళల్లో కనిపించింది. పథకాలు ఇచ్చి ఆదుకున్న జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి, గాజువాక నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చేయడానికి ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అమర్నాథ్‌ని గెలిపించడానికి ఈ వార్డు ప్రజలంతా ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. దీంతో వందలాది మంది మహిళలు పిల్లా పాపలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పథకాలన్నీ మహిళల పేరు మీద ఇచ్చారని, మహిళా పక్షపాతి అని, రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే ఈ ఎన్నికల్లో ప్రజలంతా వైసిపికి ఓటు వేయాలని ఆయన కోరారు. పేద బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా ఆదుకున్న జగన్మోహన్ రెడ్డికి ఓటేసి రుణం తీర్చుకోవాలని మంత్రి అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. తను ఎన్నికల్లో గెలిపిస్తే గాజువాకను మరింతగా అభివృద్ధి చేస్తానని, మీ కష్టసుఖాలను దగ్గరుండి చూసుకుంటారని హామీ ఇచ్చారు. పూర్తిగా స్థానికుడనైన తనను గెలిపిస్తే మీ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని అమర్నాథ్ హామీ ఇచ్చారు.

పెద్దలు నాగిరెడ్డి, చింతలపూడి వెంకట రామయ్య, మాజీ గాజువాక వైసీపీ ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, మాజీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందులను కలుపుకొని అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. అలాగే పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు.

గాజువాక నియోజకవర్గం ఇంచార్జ్ దేవన్ రెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అవినీతికి తావులేని పాలన అందించారని అన్నారు.

రాబోయే రోజుల్లో సుపరిపాలన కొనసాగాలంటే మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని మన ముఖ్యమంత్రిగా చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధి చెందడానికి జగన్మోహన్ రెడ్డి కారణమని, ఈ అభివృద్ధి ఆగకుండా కొనసాగాలంటే గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు

ఈ కార్యక్రమంలో మంత్రి శంకర్ నారాయణ, చిక్క సత్యనారాయణ, రంభ నారాయణమూర్తి, తాటికొండ జగదీష్, తాటికొండ అచ్యుత్, కులుకూరి మంగ రాజు, అనపర్తి రమణ, మొలకల పల్లి ప్రసాద్, రావాడ భవాని, శ్రీకాంత్, అండి బోయిన సన్ని, కాక్కుళ్ల మురళి, దీని శెట్టి చిన్నారావు, బ్రహ్మానంద రెడ్డి, కే. బాలాజీ, నాగు, పార్వతి, పరంకుసం ప్రమీల, నరసింహమూర్తి, పెంటకొట నాగేశ్వర రావు, ఆర్.వేణుగోపాల్ రావు, ములకలపల్లి అశోక్, కాకినాడ పెంటారావు, మంత్రి మంజుల, గొరుసు రామలక్ష్మి, పప్పల పుష్ప, తిప్పల స్వాతి, గొంప రమేష్, రామ జ్యోతి, పత్రి దేవి, ఆర్.రేవతి, అధిక సంఖ్యలో పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని పెంపొందించుకుంటే ఈశ్వరుని దర్శించవచ్చు



**విశాఖపట్నం, (మలేషియా) (విశాఖ సమాచారమ్):** మానవుడు ఈశ్వరుని దర్శించాలంటే అతడిలో మానవత్వం అనే స్థాయి వృద్ధి చెంది ఉండాలని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ మలేషియా సభ్యులు, మరియు జీవనది ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఇంటి లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో మలేషియాలోని షిర్డీ సాయి బాబా సొసైటీ వారి సన్నిధానంలో నిర్వహించిన నాలుగవ వార్షిక సమావేశంలో ఆలీషా ముఖ్య అతిధిగా పాల్గొని సభ్యులకు అనుగ్రహ భాషణం చేసారు.

మానవుడు ఆధ్యాత్మిక తత్త్వముతో, మానవత్వపు విలువలతో మనుగడ సాగించగలిగినట్లయితే ఆయా మతధర్మాలలో ప్రసాదించిన ఈశ్వరత్వం తెలియబడుతుందని తెలిపారు.

ఆధ్యాత్మిక జ్ఞాననేత్రము, సామాజిక సేవా నేత్రము అనే రెండు నేత్రాలతో శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం యొక్క తత్వం ముడిపడి ఉందని పేర్కొన్నారు

ఒక అంశాన్ని ఒక కన్నుతో చూసిన దాని కంటే రెండు కళ్ళతో చూసినప్పుడే స్పష్టత ఉంటుందని అందుచేత ఆధ్యాత్మిక జ్ఞాననేత్రము, సామాజిక సేవానేత్రము అనే రెండు నేత్రాలతో చూడగలిగినప్పుడే మానవుడిలో పరిపూర్ణత ఏర్పడుతుందని అన్నారు.

స్వార్థ చింతనతో మానవుడు ప్రకృతిని కలుషితం చేస్తున్నాడని, దానిని నివారించే ప్రయత్నంలో భాగంగా జీవనది ఫౌండేషన్ వారు నదులను శుభ్రం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతుండటం అభినందనీయమని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి సభ్యుడు మూడు మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

అనంతరము మలేషియా సభ్యులు పీఠాధిపతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీవనది ఫౌండేషన్ వారు ఉమర్ ఆలీషాకు అమెజాన్ నదీ పురస్కారాన్ని అందజేసారు. తదుపరి సభలో పాల్గొన్న అతిథులకు ఆలీషా చేతుల మీదుగా వివిధ జీవనదుల పేర్లతో పురస్కారాలను అందజేసారు.

ఈ కార్యక్రమంలో తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు డా॥ వెంకట ప్రతాప్, మలేషియా అధ్యక్షులు డా॥ అచ్చయ్య కుమార్ రావు తెలుగు అసోషియేషన్ మలేషియా పూర్వ అధ్యక్షులు నిఖిల్ గుప్త, సీఈఓ, ఇన్నోవా టోబల్ సొల్యూషన్, మురళీ రాజ్ శ్రీనివాసన్

(మిగతా 2లో)



## గన్నుతో కాల్చుకొని ఐఓబీ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నంలో ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ శంకర్రావు విధుల్లో ఉండగానే గన్‌తో పేల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గురువారం ఉదయం ఐదు గంటల షిఫ్ట్ డ్యూటీకి హాజరైన శంకర్రావు ఏడు గంటల సమయంలో తన వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు చెస్ట్‌కు గన్‌మెన్‌గా శంకర్రావు విధులు నిర్వర్తిస్తున్నారు. శంకర్రావుకు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ విషాద ఘటన ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

**ఆవేదన కలిగించిన ఆత్మహత్య దృశ్యాలు**

ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ శంకర్రావు ఆత్మహత్య దృశ్యాలు ఆవేదన కలిగించాయి. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ చెస్ట్ గార్డ్‌గా ఉంటున్న శంకర్రావు తన వద్ద ఉన్న ఎస్ ఎల్ ఆర్ గన్‌తో తానే స్వయంగా కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. శంకర్రావు ఆత్మహత్య చేసుకునే సమయంలో విధుల్లో నలుగురు కానిస్టేబుళ్లు ఉన్నారు. మిగతా ముగ్గురూ అక్కడ లేని సమయంలో ఎస్ఎల్ఆర్ గన్‌తో ఎలా కాల్చుకోవాలో ముందుగా పరీక్షించుకున్నారు శంకర్రావు. చివరకు చాతీకి ఎస్ఎల్ఆర్ గన్ పెట్టి ముందుకు వంగి మరీ కాల్చేసుకున్నారు శంకర్రావు. కాల్చుకునే ముందు "భగవంతుడా" అంటూ ట్రిగ్గర్ నొక్కుకున్న దృశ్యాలు అంతులేని ఆవేదనను కలిగించాయి. కాల్చుకున్న 13 సెకండ్ల వ్యవధిలోనే ప్రాణాలు విడిచారు శంకర్రావు. ఆ గన్ శబ్దం విని హుటాహుటిన లోనికి వచ్చారు మిగతా ముగ్గురు కానిస్టేబుళ్లు.

**ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు**

ఎస్ పీ ఎఫ్ కానిస్టేబుల్ శంకర్రావు ఆత్మహత్యపై ఏసీపీ రాంబాబు స్పందించారు. ఉదయం

(మిగతా 2లో)

అధ్భుతమైన సందేశం.
ఈ చిత్రం గీసిన కళాకారునికి నా
హృదయపూర్వక వందనాలు



(మొదటి పేజీ తరువాయిలు)

## ఉగ్రవాదం మీరు నిర్మూలించలేకపోతే ఆ పని మాకప్పగించండి

విమర్శలు గుప్పించారు. "ఎమర్జెన్సీ సమయంలో మా తల్లి అంత్యక్రియలకు వెళ్లేందుకు నాకు పెరోల్ కూడా ఇవ్వలేదు. అలాంటిది ఇప్పుడు వారు (కాంగ్రెస్) మమ్మల్ని నియంతలుగా పేర్కొంటున్నారు" అని రాజ్‌నాథ్ దుయ్యబట్టారు.

ఉగ్రవాదులను ఉద్దేశిస్తూ రక్షణమంత్రి ఇటీవల పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. "దేశంలో శాంతికి విఘాతం కలిగించేందుకు ఏ ఉగ్రవాది అయినా ప్రయత్నిస్తే, తగిన సమాధానం చెప్తాం. ఒకవేళ వారు పాకిస్థాన్‌కు పారిపోయినా వదలం. అక్కడికి వెళ్లి మరీ మట్టుపెడతాం" అని హెచ్చరించారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల మిస్టరీ మరణాల వెనుక న్యూఢిల్లీ హస్తం ఉందంటూ యూకే మీడియా రాసిన కథనంపై స్పందిస్తూ రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఎప్పుడూ ఏ దేశంపై దాడి చేయదని, వారి భూభాగాలను ఆక్రమించేందుకు యత్నించదని స్పష్టంగా చెప్పారు.

## రంజాన్ వేడుకల్లో టోపీ ధరించిన చంద్రబాబు

శాతం మేం చేస్తే మిగిలిన 10 శాతం కూడా జగన్ పూర్తిచేయలేదు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకే మూడు పార్టీలు కలిశాయి. వైకాపా పాలనలో మైనార్టీలపై జరిగిన దాడులు కోకొల్లలు. నాలాంటివాడినే ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారికి సామాన్యులు ఓ లెక్కా? నంద్యాల జిల్లాలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకునేలా వైకాపా నేతలు వేధించారు. సీఏఏకు మద్దతు తెలిపి మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్న వ్యక్తి జగన్. ఓట్ల కోసం ఆయన దొంగ జపం చేస్తున్నారు. మోసపోవద్దు" అని చంద్రబాబు సూచించారు.

## ఉగ్రవాదాన్ని పోషించే రాష్ట్రాలకు ప్రధాని తీవ్ర హెచ్చరిక

సైనికుల ఖాతాల్లో జమ చేసిందని మోదీ వివరించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన 3500 మంది మాజీ సైనిక ఉద్యోగ కుటుంబాలు ఉన్నాయని వివరించారు.

**ఆధునిక రైఫిళ్లు**

సైనికులకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను అందజేశామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అత్యాధునికి రైఫిళ్లను సమకూర్చామని ప్రకటించారు. ఫైటర్ ఫ్లైట్స్ అందజేశామని ప్రధాని మోదీ వెల్లడించారు. తమ హయాంలో జాతీయ రహదారుల అభివృద్ధి చేశామని, టన్నెల్స్ మెరుగుపరిచామని పేర్కొన్నారు.

## మానవత్వాన్ని పెంపొందించుకుంటే ఈశ్వరుని దర్శించవచ్చు

షిర్డీ సాయిబాబా అసోషియేషన్ మలేషియా సభ్యులు గిడుగు కాంతి కృష్ణ, గిడుగు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పలనాయుడు, తెలుగు అకాడమీ మలేషియా ప్రిన్సిపాల్ అక్కయ్య, జీవనది ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఇంటి దుర్గాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఐఓబి సెక్యూరిటీ గార్డు కాల్చుకొని ఆత్మహత్య

ఐదు నుంచి ఏడు గంటల డ్యూటీకి వచ్చి గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, శంకర్రావు నైట్ డ్యూటీ కూడా చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ రాంబాబు చెప్పారు. ఛాతిలో గన్ పెట్టి తానే కాల్చుకున్నాడన్న శంకర్రావు బుల్లెట్ ఎంట్రీ, లోపల నుండి బయటకు వెళ్లడం వల్ల మరణించినట్టు తెలిపారు. శంకర్రావు సొంతూరు శ్రీకాకుళం జిల్లా రాజాం అని రాంబాబు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సమగ్ర విచారణ జరపుతున్నట్లు వెల్లడించారు పోలీసులు.

## ఇప్పటి వరకు 100 కోట్లకు పైగా నగదు దొరికింది: రాష్ట్ర ఎన్నికల అధికారి మీనా

వస్తువులను జప్తు చేశారు. ఇందులో కేవలం గత 24 గంటల్లోనే రూ.1.97 కోట్ల విలువైన వస్తువులను జప్తు చేశారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన నాటి నుండి నేటి వరకూ చేయబడిన మొత్తం జప్తులో రూ.25.03 కోట్ల నగదు, రూ.12.5 కోట్ల విలువైన 6,14,837.76 లీటర్ల లిక్కర్, రూ.20 కోట్ల విలువైన 68,73,891.25 గ్రాముల డ్రగ్స్, రూ.51.24 కోట్ల విలువైన 11,54,618.90 గ్రాముల ప్రెషస్ మెటల్స్, రూ.2.42 కోట్ల విలువైన 4,71,020 ఉచితాలను, రూ.7. 05 కోట్ల విలువైన 9,84,148.09 ఇతర వస్తువులను జప్తు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

అలాగే లోక్‌సభ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల తేదీలను EC ప్రకటించిన తర్వాత మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రారంభించింది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈసీ కేసు నమోదు చేస్తోంది. ఎన్నికల సంఘం ప్రభుత్వ ఉద్యోగులపై ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఎన్నికల కమిషన్‌కు అనేక ఫిర్యాదులు అందుతున్నాయని అధికారి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు మే 13న శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా, ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి.

## రోలర్ స్కేటింగ్‌లో లుక్యాశ్రీ ప్రతిభ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 21వ ఆలిండియా ఇన్విటేషనల్ రియల్ గోల్డ్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖకు చెందిన మల్లిడి లుక్యాశ్రీ ప్రతిభ సాధించింది. డీఆర్ఎస్ఏ అకాడమీ ద్వారా పోటీలకు వెళ్లిన ఆమె ఈ నెల 7న ఏపీ వ్యాప్తంగా అండర్-5లో రెండో ర్యాంకు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తన క్యాంపు కార్యాలయంలో లుక్యాశ్రీని గురువారం అభినందించారు. ఆమె మరిన్ని శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కోచ్‌ను ప్రోత్సహించారు. ఆమె తల్లిదండ్రుల్ని అభినందించారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు, గొలగాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## 20వ వార్డులో వైసిపి ప్రచారం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గురువారం 20వ వార్డు పెదవాల్టేర్ వైఎస్ఆర్సిపి సీనియర్ లీడర్స్ ఆధ్వర్యంలో గడపగడప కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ, పార్లమెంట్ సభ్యులు బొత్స ఝాన్సీలను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో 20వ వార్డు ప్రెసిడెంట్ మద్ది పోలి రెడ్డి, బి రమాదేవి, దాసరి పండరీబాయి, బుజ్జి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**పంచాంగం**

శుక్రవారం 12-04-2024
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్రమాసం

| | |
|---|---|
| తిథి | : శు. చవితి సా. 04.59 |
| నక్షత్రం | : రోహిణి తె. 04.47 |
| వర్జ్యం | : రా. 08.59 ల 10.35 |


**విశాఖ సమాచారమ్**
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345,
8247526179


## ఏపీ కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)ల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగానూ ఇంటర్ ఫస్ట్‌ఇయర్ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పొడిగించింది. ఈ మేరకు ఏప్రిల్ 20వ తేదీ వరకు గడువు పెంచుతున్నట్లు సమగ్రశిక్షా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 11వ తరగతిలో ప్రవేశాలు పొందేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 29,621 దరఖాస్తులు అందాయని ఆయన పేర్కొన్నారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు 45,621 దరఖాస్తులు వచ్చినట్లు ఏప్రిల్ 10వ తేదీన ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 352 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)ల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. ఇతర సందేహాలు, వివరాలకు 18004258599 ఫోన్ నంబరును సంప్రందించాలని ఆయన సూచించారు.

**ఏపీలో ప్రశాంతంగా టోఫెల్ పరీక్ష. 4,53,265 మంది విద్యార్థులు హాజరు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13,104 పాఠశాలల్లో టోఫెల్ పరీక్షకును ప్రశాంతంగా నిర్వహించారు. మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 4,53,265 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు పాఠశాల



విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వెల్లడించారు. ఇక 6 నుంచి 9వ తరగతి చదువుతున్న 16, 52,142 మంది రేపు అంటే ఏప్రిల్ 12వ తేదీన టోఫెల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ సర్టిఫికెట్ అందిస్తారు.

**శాతవాహన యూనివర్సిటీ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పరీక్ష ఫీజు గడువు పెంపు**

తెలంగాణ రాష్ట్రంలోని శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు ఏప్రిల్ 22వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. రూ.300 అపరాధ రుసుంతో ఏప్రిల్ 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.


శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

- 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
- మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.

కార్డోరియం ప్లస్




కావల్సిన వారు సంప్రదించండి:
9393949347

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపీ, పీఎంపీ, డీఏఎంపీ, బీఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్‌నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి. స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.
మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.
అందరూ ఆరోగ్యంగా ఉండండి.



జనహిత ట్రస్ట్(రి)
9-3-16, పిఠాపురం కోలని,
విశాఖపట్నం- 530003
ఫోన్: 8247526179
Compli

# విశాఖ సమాచారమ్

శుక్రవారం 12-04-2024


## ఓటర్లలో బాధ్యత

2019-2024 మధ్య సోషల్ మీడియా కొన్ని వందల రెట్లు పుంజుకుంది. ఈ మీడియా మారుమూల గ్రామాలు, పట్టణాలలోని అభివృద్ధి చెందని ప్రాంతాలలో నివసిస్తున్న ఓటర్ల మనోభావాలను నేరుగా ఇంటర్నెట్‌లో ప్రవేశ పెడుతోంది. గతానికి, ఇప్పటికి ఉన్న తేడా ఏమిటంటే ఓటర్లు ఇప్పుడు బాగా పరిణతి చెందారు. ఏ మీడియా ప్రభావం అయితేనేమి వారిలో ఎవరు ఏమిటో చాలామందికి అవగాహన కలిగినట్లే వారి మాటలు ఉన్నాయి. మారుమూల కొండకోనల్లోని గిరిజన ప్రాంతాల ప్రజలకు గతంలో ముఖ్యమంత్రి పేరు, ప్రధానమంత్రి పేరు, కనీసం తమ స్థానిక శాసనసభ్యుడు, లోక్‌సభ సభ్యుల పేర్లు తెలిసి ఉండేవికాదు. ఎవరు ఎన్ని ప్రశ్నలు వేసినా వారికి తమ గ్రామసర్పంచ్ మినహా మరెవరి పేరు తెలిసేది కాదు. ఈరోజు వారు కేంద్ర రక్షణమంత్రి, హోంమంత్రి, రాష్ట్ర విద్యాశాఖామంత్రి పేర్లు కూడా జ్ఞాపకం ఉంచుకొని మరీ చెప్పగలుగుతున్నారు.

కొన్ని వీడియోల ఆధారంగా పరిశీలిస్తే కొన్ని మతాలకు ప్రఖ్యాత మీడియా ఆపాదించిన సంకుచిత భావనలు ఎంత మాత్రమూ నిజం కావని అవగాహన కలుగుతుంది. వారు సర్వజన, సకల సామాజిక వర్గాలలో తామూ ఒకరిమని, తమకు కుల, మత భేదాలు, ద్వేషాలు లేవని తెలిపారు. అంతేకాకుండా ఎన్నికలలో అసలు సిసలైన పార్టీల అభ్యర్థులనే ఎన్నుకుంటామని, ఓటు వేసేటప్పుడు కుల, మతాలకు ఎటువంటి ప్రాధాన్యతను ఇవ్వమని వారు తెలపడం మన రాష్ట్ర ఓటర్ల మనోగతాలకు నిదర్శనంగా భావించవచ్చు.

ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలన్నా, ఎన్నికలన్నా కేవలం డబ్బుతో ముడిపడి ఉంటాయని, ఓటర్లు డబ్బు తీసుకొని ఇచ్చినవారిని గెలిపిస్తారని ఇతర రాష్ట్రాలలో ఒక భావన ఉండేది. ఎలాంటి నేరాలు చేసినవారికైనా ఇక్కడి రాజకీయ నాయకులు రక్షణ కల్పిస్తారని, డబ్బు తీసుకొని ఎటువంటి నేరాన్నైనా సమర్థిస్తారని, డబ్బు కోసం ఎలాంటి పనైనా నిస్సంకోచంగా చేసేస్తారని ఇతర రాష్ట్రాల ప్రజలు ఇప్పటికీ నమ్ముతున్నారు. ఇక్కడి అధికార మరియు రక్షణ యంత్రాంగం పూర్తిగా పాలకుల చెప్పుచేతల్లో ఉంటుందని, వారు కూడా ఎటువంటి తప్పిదాలకైనా వెనుకాడరని, ప్రజాధనం దుర్వినియోగం చేయడంలోను, దోపిడీ చేయడంలోను అందరూ ముందుంటారని మన రాష్ట్రానికి ఇతర రాష్ట్రాలలో గల మంచిపేరు.

ఈ పేరుకు తగినట్లుగానే గడచిన పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ మత్తుపదార్థాల వాణిజ్యానికి ప్రధాన కేంద్రంగా చెప్పుకోబడేలా ఇటీవల మీడియా విశేషంగా ప్రచారం చేసింది. ఎన్ని టన్నుల గంజాయి పట్టుబడుతోందో లెక్కేస్తే అసలు ఎన్ని ఎకరాలలో గంజాయిని సాగు చేస్తున్నారో ఊహించుకోవచ్చు. ఇటువంటి చట్టవ్యతిరేకమైన వ్యవసాయం కేవలం వర్తకులకు మాత్రమే సాధ్యంకాదు. దీనికి అన్నివర్గాల అండదండలు కావాలి. చివరికి నిరక్షరాస్యులు సైతం అసహ్యించుకునేలా ప్రవర్తిస్తున్న మీడియా వ్యక్తులు కూడా ఈ వ్యాపారాలలో తలమునకలై ఉన్నట్లు జరిగిన అరెస్టులను బట్టి తెలుస్తోంది.

ఇప్పుడు తాజా పరిణామాల దృష్ట్యా ఓటర్లు తమతమ ప్రాంతాలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల గురించి అవగాహన చేసుకొని వారి పట్ల ఒక రకమైన అభిప్రాయం ఏర్పరచుకొని తదనుగుణంగా మంచిని సమర్థించేలా ఓట్లు వేస్తారని ఆశ కలుగుతోంది. డబ్బులు ఈ ఎన్నికలలో పెద్దగా ప్రభావం చూపలేక పోవచ్చునని, రాజకీయ నాయకుల నుండి సొమ్ము తీసుకొని ఓటర్లకు పంచిపెట్టే వారికి ప్రజలు ఇస్తున్న సమాధానాలు, వేస్తున్న ప్రశ్నలు తెలియజేస్తున్నాయి. అక్షరాస్యతా ప్రభావం ఓటర్ల మదిని తాకి వారిలో ఎన్నికల పట్ల అవగాహన కల్గించడం ప్రారంభిస్తే ఇకపై భారత ప్రజాస్వామ్యం నిజాయితీ పరులకే పట్టం గడుతుందని ధైర్యంగా చెప్పవచ్చు. కేవలం డబ్బులు తీసుకొని నేరస్థులను, ఆయా నేరస్థులను పోషిస్తున్న పార్టీలను, వెనకేసుకు వస్తున్న పెద్దపెద్ద నేతలను ఓటర్లు చిన్నచూపు చూస్తున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉన్నారని సోషల్ మీడియా బయట పెడుతోంది.

నిఖార్సైన వ్యక్తులు మాట్లాడుతున్న మాటలు, ప్రభుత్వాల పట్ల, అభివృద్ధి పట్ల వారు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు ఇతర ఓటర్లను బాగా ప్రభావితం చేస్తున్నాయి. అభ్యర్థుల తాబేదార్లుగా వ్యవహరిస్తున్న వ్యక్తులను ఓటర్లు అసహ్యించుకుంటున్న ప్రత్యక్ష వీడియోలు, నిలదీస్తున్న వీడియోలు చాలా మందిలో ఉత్తేజాన్ని కల్గిస్తున్నాయి. ప్రజలు ఏ ప్రభుత్వం తమకు ఎటువంటి మేలు చేసిందో, ఎటువంటి కీడు చేసిందో, ఏ ప్రభుత్వ విధానాల ద్వారా తాము బాగుపడ్డామో లేదా నష్టపోయామో తెలుసుకునే స్థితిలో ఓటర్లు ఉన్నారని సోషల్ మీడియా తెలియజేస్తోంది. పత్రికలలో వ్రాసే వాస్తవాలు, అబద్ధాలను ప్రజలు పూర్తిగా అర్థం చేసుకొని అబద్ధాలు వ్రాసే పత్రికలను అసహ్యించుకుంటున్నట్లు కూడా సోషల్ మీడియా వీడియోలు చూపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో తాము ఎంత డబ్బు ఎందుకు ఖర్చు చేస్తున్నామో, తిరిగి ఎలా రాబట్టుకోగలమో అని ఆలోచించగలిగే అభ్యర్థులు తమ నిర్ణయాలను, విధానాలను మార్చుకోగలిగితే మంచిది.

-సూరంపూడి వీరభద్రరావు

## శివాజీ పార్క్‌లో సనాతన యోగా సత్సంగం వారి ఉగాది వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ రోజు శ్రీ 'క్రోధి' నామ సంవత్సర ఉగాది పండగను శివాజీ పార్క్‌లో సనాతన యోగా సత్సంగం ఆధ్వర్యంలో జరుపుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీ.వీ మాధవ్, మాజీ MLC ఉగాది విశిష్టత చెప్పారు మరియు ఇస్కాన్ మెంబర్ ప్రభుశ్రీ పార్థసారథి ప్రవచనంలో "అందరూ ప్రేమతత్వం కలిగి వుండాలని, ప్రేమే ప్రపంచ శాంతికి మూలం" అని ఉపదేశించారు.

తదుపరి యోగా సంస్థ అధ్యక్షులు గుంట ధర్మారావు మాట్లాడుతూ నిత్యం యోగా చేయుట వలన మనిషి ఆరోగ్యంగా,ఆనందంగా జీవిస్తారు అని చెప్పారు.

తదుపరి సంస్థ విడుదల చేసిన బ్రోచర్‌ను మాధవ్ చేతుల మీద ఆవిష్కరించారు.

కార్యక్రమంలో ట్రెజరర్ ఎం. శ్రీవాస్, జాయింట్ సెక్రెటరీ జి.శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బి. అప్పారావు, మెంబర్స్ జె. మోహనరావు, బి. జనార్ధన రావు, రామారావు, పద్మ, నాగమణి, భానుమతి, రాజు, టివి. శ్రీనివాస్, ధనుంజయ రావు, తదితరులు పాల్గొన్నారు.

## డి.వి.ఆర్. కార్యాలయంలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక లక్ష్మీనారాయణ నగర్‌లోని డి.వి.ఆర్. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మొల్లి రమణబాబు పాల్గొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఒక సంఘ సంస్కర్తగా అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని అన్నారు. తండ్రి గోవిందరావు, తల్లి చిన్నాబాయికి రెండో సంతానంగా జ్యోతిరావు పూలే జన్మించారన్నారు. మానవ హక్కులపై పుస్తకాన్ని రచించారని చెప్పారు. కుల వ్యతిరేక కార్యకర్తగా పనిచేసి అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు విశేషంగా కృషిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పెదపాటి కల్యాణి, బీసీ సీనియర్ నాయకులు వై.శ్రీనివాసరావు, మద్దాల కృష్ణ, కోడి నాగేశ్వరరావు, ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి రామకృష్ణ, పెందుర్తి నియోజకవర్గ మండల అధ్యక్షులు ఇ.రమేష్, యు.అప్పలరాజు, ఎం.నర్సింగరావు, వేగి దొరబాబు, వియ్యపు శ్రీనివాస్ యాదవ్, యల్లపు శ్రీనివాస్,అళ్ల ప్రవీణ్‌కుమార్, కాండ్రేగుల రవి, ఆడారి రవికుమార్, బీసీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జ్యోతిరావు పూలేకి ఘనంగా పుష్పాంజలి ఘటించారు.

## అవంతి విజయానికి కృషి చేస్తాం- వైసీపీ నాయకులు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి శాసన సభ నియోజక వర్గ అభ్యర్థి అవంతి శ్రీనివాసరావును గెలిపిస్తామని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేసారు. స్థానికంగా గల ఎంఎల్‌ఏ అవంతి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మండలంలో తాళ్ళవలస పంచాయితీ గొల్లల తాళ్లవలస పరిధి గొలగాని వారి కళ్లాలు నుండి పలువురు నాయకులు అవంతి శ్రీనివాసరావును కలుసుకొన్నారు. ఈ సందర్భం వారి ప్రతినిధి గొలగాని సన్యాసిరావు మాట్లాడుతూ తాళ్ళవలస ఉప సర్పంచ్ బుజ్జి రాజు వైసీపీలో పదవులు అనుభవించి తల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసి పార్టీని వీడడం సరికాదన్నారు. అటువంటి వారు పార్టీని వీడినంత మాత్రాన ఏమి నష్టం లేదని ఆయన అన్నారు. అవంతి వెంటే మేమందరం అని ఆయన గెలుపునకు కృషి చేస్తామని వారు స్పష్టం చేసారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గొలగాని రాజు, మాజీ ఎంపీటీసీ పాసి అప్పలనర్సయ్య, 6వ వార్డు సభ్యురాలు గొలగాని నాగమణి, పల్ల బుజ్జి, గొలగాని ఏమలయ్య, బొబ్బిలి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## నూకాలమ్మ ఉత్సవ ఆదాయం 10.69 లక్షలు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 7 నుండి 10వ తేదీ వరకు జరిగిన స్థానిక నూకాలమ్మ తల్లి జాతర ఉత్సవాలకు సంబంధించి 10 లక్షల 69 వేల 636 రూపాయిల మేర ఆదాయం వచ్చినట్లు ఉత్సవ అధికారి కీర్తి శ్రీనివాసరావు, దేవాలయ కార్య నిర్వాహణాధికారి మురళీ మోహన్ తెలిపారు. గురువారం స్థానికంగా విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొంటూ దీనిలో టికెట్ల ద్వారా 5లక్షల 88 వేల 300 రూపాయిలు, హుండీల ద్వారా 4లక్షల 81 వేల 336 రూపాయలు ఆదాయం వచ్చిందని వారు తెలిపారు. గత సంవత్సరం టికెట్ల ద్వారా 5లక్షల 85 వేల 360రూపాయిలు, హుండీల ద్వారా 5లక్షల 46 వేల 927 రూపాయిలు మొత్తం 11లక్షల 32 వేల 287 రూపాయిలు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సహకరించిన వారందరికీ వారు కృతజ్ఞతలను తెలియజేసారు.

## శ్రీ కంచి పరమాచార్య వైభవం

### పక్షవాతం - పేకముక్కల చికిత్స

ఒక పెద్దాయనకు పక్షవాతం వల్ల కుడిపక్కన అవయవాలన్నీ చచ్చుబడిపోయి చలనం లేకుండా పోయింది. వైద్య చికిత్స వల్ల ఫలితం అంతగా కనిపించడం లేదు. అతనికి మాటలు రాక జ్ఞాపకశక్తి కూడా నశించిపోయింది. వారి భార్య పరమాచార్య స్వామి వారి వద్దకు వెళ్ళి కళ్ళ నీరు కారుస్తూ తన గోడు చెప్పుకుంది.

"మహాస్వామి వారు కరుణించి నా భర్తను మళ్ళా మామూలు మనిషిని చేయవలసినది" అని ప్రార్థించింది.

స్వామి వారు కొద్దిసేపు మౌనంగా ఉన్నారు.

"అతను కోలుకోవడానికి ఏమైనా చెయ్యడానికి సిద్ధమా?" అని అడిగారు

"ఎంత ఖర్చైనా పర్లేదు పెరియవ" అన్నది ఆవిడ.

"నా ఆంతర్యం అది కాదు. నేను చెప్పిన విషయం తేలికగా తీసుకోరు కదా?" అని అడిగారు.

"లేదు పెరియవ మీరు చెప్పినట్టే చేస్తాను"

'రెండు కట్టల పేకముక్కలు తీసుకుని ఎల్లప్పుడూ అతని కంటికి కనబడేట్టు పెట్టండి. నిదానంగా అతని జ్ఞాపకశక్తి పెరిగి మాటలు వస్తాయి" అని సెలవిచ్చారు.

ఆ వచ్చినావిడ తెల్లబోయింది. కాని అది సరైన వైద్యమే అని నిర్ధారించుకుంది. కాని ఒక్క విషయం ఆవిడకి అర్థం కాలేదు. "నా భర్త పేకాటకు బానిస అని స్వామి వారికి ఎలా తెలుసు" అని అనుకుంది. కాని రోజంతా పేకముక్కలు చూసినంత మాత్రాన తన భర్త పక్షవాతం నుండి బయటపడతాడా?

పరమాచార్య స్వామి ఆజ్ఞప్రకారం ఆవిడ అలాగే చేసింది. కొద్దిరోజులలోనే ఆ పెద్దమనిషి కోలుకోవడం ప్రారంభించాడు. అతని జ్ఞాపకశక్తి పుంజుకోవడం ప్రారంభించింది. కొద్దిరోజుల తరువాత పూర్తిగా కోలుకున్నాడు.

మనవళ్ళతో పేకాట ఆడటం మొదలుపెట్టాడు. పిల్లలు తప్పు చేస్తే ప్రేమతో మందలిస్తూ, "నువ్వు ఇప్పుడు స్పేడ్ వెయ్యాలి హార్ట్స్ కాదు" అనేవాడు. పడిపోయిన నోరు కూడా బాగుపడి మాట్లాడడం మొదలు పెట్టాడు.

ఎంటువంటి పరిహారం సూచించారు మహాస్వామి వారు? ఇంటి వైద్యమా? పేక వైద్యమా? ఏదేమైనా గెలుపు ముక్క ఉన్నది వారి చేతుల్లోనే.

## కంట్రోలు రూమును పరిశీలించిన కలెక్టర్



**విజయనగరం:** కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమును జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి గురువారం సందర్శించారు. వివిధ విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. నమోదు చేసిన కేసులను, తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్‌కు సిపిఓ పి.బాలాజీ, నోడల్ అధికారి డాక్టర్ సత్య ప్రసాద్ వివరించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ ఎస్‌డి అనిత కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రైవేటు ఆస్పత్రులు, వైద్యులకు హెచ్చరిక



ప్రైవేటు ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ సంఖ్య, కన్సల్టెంట్ డాక్టర్ల పేర్లను విధిగా బోర్డులపై ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య మండలి ఆదేశించింది. ఫార్మా-డీ డిగ్రీ కలిగిన వారిని, ఆయుష్ డాక్టర్లను డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా నియమించడం నిబంధనలకు విరుద్ధమని తెలిపింది. మెడికల్ కౌన్సిల్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ప్రాక్టీస్ చేయొద్దని, నిబంధనలు పాటించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

## స్కూల్ బస్ బోల్తా - ఏడుగురు చిన్నారులు మృతి

హర్యానాలో ఘోర ప్రమాదం జరిగింది. మహేంద్రగఢ్ జిల్లాలో స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు చిన్నారులు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. వేగంగా వెళ్తున్న బస్సు ఓ మలుపు వద్ద నియంత్రణ కోల్పోయింది. దీంతో అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టి బోల్తా పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 35-40 మంది విద్యార్థులు ఉన్నారు. సెలవు రోజు అయినప్పటికీ ప్రైవేటు పాఠశాల సెలవు ఇవ్వలేదు. ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా స్కూల్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరగడం గమనార్హం.

స్థానికుల ద్వారా ప్రమాద వివరాలు తెలుసుకున్న పోలీసులు, ఉన్నతాధికారులు హుటాహుటిన స్పాట్‌కు చేరుకున్నారు. స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలు బయటకు తీశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో భీతావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. గాయపడిన వారు ఆక్రందనలు, మృతుల కుటుంబీకుల రోదనలతో ఆ ప్రాంతమంతా రణరంగంగా మారింది.

ప్రమాదంపై హర్యానా విద్యాశాఖ మంత్రి సీమా త్రిఖా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇది చాలా బాధాకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సెలవు దినాల్లో పాఠశాల నిర్వహించడం చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. డ్రైవర్ మద్యం తాగి ఉన్నారని, చాలా వేగంగా డ్రైవింగ్ చేసినట్లు బాధిత విద్యార్థులు తెలిపారు. దీంతో పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విచారం వ్యక్తం చేశారు. గాయపడిన విద్యార్థులకు సహాయం అందిస్తున్నామని, వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలుపుతూ హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ మృతుల కుటుంబాలకు తన సంతాపం వ్యక్తం చేశారు.




# జుట్టు రాలుతోందా?



జుట్టు రాలడం అనేది ప్రతి ఒక్కరికీ వస్తుంది. అయితే ఇది మామూలుగా మారకముందే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణ పరిస్థితుల్లో రోజుకు 50 నుంచి 100 వెంట్రుకలు రాలిపోతాయి. ఉదయం లేదా స్నానం చేసిన తర్వాత మీ దిండుపై కొంత వెంట్రుకలు కనిపించడం సాధారణం. మీరు కోల్పోయే జుట్టు మొత్తం దాని పొడవు మరియు మందంపై ఆధారపడి ఉంటుంది మరియు మీరు పడుకునే దిండు కూడా తరచుగా జుట్టు రాలడానికి దోహదం చేస్తుంది.

అయితే జుట్టు రాలడం సాధారణం కంటే ఎక్కువగా ఉంటే మాత్రం జాగ్రత్త పడాలి. ఇది మిమ్మల్ని ప్రమాదకరమైన పరిస్థితి లో ఉంచుతుంది. కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండండి. జుట్టు ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి ఏమి చూడాలో చూద్దాం. అంతేకాదు, మీ జుట్టు రాలడం విపరీతంగా ఉందో లేదో తెలుసుకోవడానికి మనం కొన్ని విషయాలు వెతకవచ్చు.

ఒకసారి చూడు మీరు సాధారణం కంటే ఎక్కువగా రాలిపోతుంటే చెప్పడానికి ఒక మార్గం ఏమిటంటే మీ జుట్టు పట్టుకుని మెల్లగా లాగడం. మీరు సరైన మొత్తంలో జుట్టును కోల్పోతే, 3 కంటే ఎక్కువ వెంట్రుకలు రాలవు. కానీ మీకు అసాధారణంగా జుట్టు రాలిపోతే జుట్టు రాలిపోయే సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది మీకు మరింత ప్రమాదాలను కలిగిస్తుంది. ఈ స్థితిలో, జుట్టును జాగ్రత్తగా చూసుకోవడం ద్వారా మాత్రమే జుట్టు రాలడాన్ని నివారించవచ్చు.

షవర్ తర్వాత జుట్టు మీరు స్నానం చేసిన తర్వాత బాత్రూంలో ఎంత జుట్టు పడి ఉందో మీరు చూడవచ్చు. తలస్నానం చేస్తే కొన్ని వెంట్రుకలు రాలిపోవడం సహజం. కానీ ఆ తర్వాత దువ్వెన మరికొన్ని కోల్పోవచ్చు. కానీ మీరు మీ బాత్రూమ్ ఫ్లోర్‌లో చాలా జుట్టును నిరంతరం గమనిస్తే, అది అధిక జుట్టు రాలడానికి సంకేతం కావచ్చు. ఈ విషయాలను పెద్దగా పట్టించుకోకపోవడం ముఖ్యం. ఎందుకంటే మీలో ఎక్కువ సమస్యలు మరి యు ఒత్తిడి ఉన్నాయ న్నది నిజం.

మీకు అధిక జుట్టు రాలుతుందో లేదో తెలుసుకోవడానికి మరొక మార్గం ఏమిటంటే, మీ జుట్టును 60 సెకన్ల పాటు బ్రష్ చేయండి మరియు రాలిపోయే వెంట్రుకల సంఖ్యను లెక్కించండి. దాదాపు 10 వెంట్రుకలు రాలడం సాధారణం, మరియు మీకు ఎన్ని వెంట్రుకలు వచ్చినా, మీరు అధిక జుట్టు రాలడం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇది తరచుగా మరిన్ని సవాళ్లను సృష్టిస్తుంది.

పోనీటైల్ మీరు మీ జుట్టును కట్టుకునే విధానం కూడా మీ జుట్టు ఆరోగ్యాన్ని తెలియజేస్తుంది. జుట్టు పల్చబడటం అనేది మీరు డాక్టర్‌ని సంప్రదించవలసిన సంకేతాలలో ఒకటి. గణనీయమైన వ్యత్యాసం ఉన్నంత వరకు మీరు దానిని గమనించనప్పటికీ, ఇది గణనీయమైన జుట్టు రాలడాన్ని సూచిస్తుంది. పోనీటైల్‌ని చూసి జుట్టు మందాన్ని చెప్పవచ్చు.

బట్టతలని గమనించండి బట్టతల అనేది పురుషులలోనే కాదు స్త్రీలలో కూడా వస్తుంది. ముందుగా చేయవలసినది బట్టతల కోసం మీ స్కాల్ప్ చెక్ చేసుకోవడం. మీరు క్రమం తప్పకుండా జుట్టు రాలడాన్ని అనుభవిస్తే, మీరు మీ తలపై బట్టతల కూడా కావచ్చు. మీరు సన్నబడటానికి పాచెస్ గమనించినట్లయితే, ఇది జుట్టు రాలడానికి మొదటి సంకేతాలలో ఒకటి కావచ్చు. కాబట్టి తెలుసుకోవలసిన విషయం ఏమి టంటే దానిని ఎప్పుడూ పెద్దగా పట్టించుకో కూడదు.

దిండుపై శ్రద్ధ వహించండి నిద్రపోతున్నా 5 నుంచి 20 వెంట్రుకలు రాలడం సహజం. ముఖ్యంగా మీరు కాటన్ దిండుపై పడుకుంటే జాగ్రత్తగా ఉండండి. అవి మీ జుట్టు నుండి తేమను గ్రహిస్తాయి. ఇది జుట్టును పొడిగా మరియు పెళుసుగా చేస్తుంది. కానీ మీరు ఉదయాన్నే మీ దిండుపై చాలా వెంట్రుకలను చూడటం ప్రారంభిస్తే, మీరు అధిక జుట్టు రాలడాన్ని ఎదుర్కొంటున్నారనే సంకేతం కావచ్చు. కాబట్టి మీరు పైన పేర్కొన్న ఏవైనా లక్షణాల ద్వారా ప్రభావితమైతే, మీరు దానిని గుర్తించి, నివారణను కనుగొనాలి.

# ఈ ఆహారాలను చాలా మితంగా తీసుకోవాలి



ఆర్థరైటిస్, ఇన్ఫ్లమేటరీ జాయింట్ డిజార్డర్.. కీళ్లు, ఇతర కణజాలాలపై ప్రభావం చూపుతాయి. భరించలేని నొప్పికి కారణం అవుతుంది. ఆర్థరైటిస్‌కు చికిత్స లేనప్పటికీ.. ప్రారంభ రోగ నిర్ధారణ లక్షణాల నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడే టిప్స్ చాలానే ఉన్నాయి. ఈ సంవత్సరం ప్రపంచ ఆర్థరైటిస్ డే థీమ్ 'ఇది మీ చేతుల్లోనే ఉంది, చర్య తీసుకోండి'. ఈ నినాదంతో ఆర్థరైటిస్ సమస్యపై పోరాటం మీ చేతుల్లోనే ఉందని, తక్షణమే ఆర్థరైటిస్ సమస్య నుంచి బయటపడేందుకు చర్యలు తీసుకోవాలని నినదించింది డబ్ల్యూహెచ్‌ఓ. ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వ్యక్తులు, వారి సంరక్షకులు, కుటుంబాలు, ఇతరులను వారి జీవనశైలిని మెరుగుపరచడానికి చర్య తీసుకునే విధంగా ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడమే దీని లక్ష్యం. ఆర్థరైటిస్ వ్యాధి నివారణకు మంచి పోషకాహారం తీసుకోవడంతో పాటు, శారీరక శ్రమ కూడా చాలా ముఖ్యం. హానీకరమై ఆహారాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వలన కీళ్ల నొప్పుల సమస్య నుంచి బయటపడొచ్చు.

కొన్ని ఆహారాలు, డ్రింక్స్ ఆర్థరైటిస్ సమస్యను, తీవ్రతను తగ్గిస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. జీవన ప్రమాణాన్ని కూడా పెంచుతుందని చెబుతున్నారు. అదే సమయంలో మరికొన్ని ఆహారాలు ఆర్థరైటిస్ సమస్యను మరింత తీవ్రం చేస్తాయని అనేక అధ్యయనాల్లో తేలింది. మరి హానీ తలపెట్టే ఆహారాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

ఆర్థరైటిస్ బాధితులు తినకూడదని ఆహారాలు..

**షుగర్..** ఆర్థరైటిస్‌తో బాధపడేవారు చక్కెరతో చేసిన పదార్థాలను తక్కువగా తినాలి. స్వీట్స్, ఐస్‌క్రీమ్, సోడా మొదలైన వాటికి దూరంగా ఉండాలి.

**ఫ్రై చేసిన పదార్థాలు..** ఫ్రై చేసిన ఆహారాలు, వేయించిన మాంసం, చల్లబడిన ఆహార పదార్థాలు, కాల్చిన ఉత్పత్తులు, ప్యాక్ చేసిన ఆహారం, చిరుతిళ్లు ఆర్థరైటిస్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. వీలైనంత వరకు వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు.

**ప్రాసెస్ చేసిన ఆహారం..** కొన్ని పరిశోధనల ప్రకారం రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసం ఆర్థరైటిస్ సమస్యను మరింత తీవ్రం చేస్తుంది. ప్రాసెస్ చేసిన పాలు, పాల ఉత్పత్తులలోని ప్రోటీన్ కీళ్ల చుట్టూ ఉన్న కణజాలానికి ఇబ్బంది కలిగిస్తుంది. రెడ్ మీట్‌లో ఉండే సంతృప్త కొవ్వులు వాపును మరింత పెంచుతాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి.

**ఒమేగా-6..** ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే పదార్థాలు అతిగా తీసుకోవద్దు. మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు, వేరుశెనగ, సోయా నూనెలను అధికంగా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పుల సమస్య మరింత పెరిగే అవకాశం ఉంది.

**సంతృప్త కొవ్వులు అధికంగా ఉండే ఆహారాలు..** సంతృప్త కొవ్వులు, అడ్వాన్స్‌డ్ గ్లైకేషన్ ఎండ్ ప్రొడక్ట్స్.. మయోన్నైస్, వనస్పతి, క్రీమ్ చీజ్, వెన్న, చీజ్‌లలో ఎక్కువగా ఉంటాయి. వీటికి దూరంగా ఉండటం మంచిది. వీటి వినియోగం పరిమితంగా ఉండాలి. లేదంటే ఆర్థరైటిస్ సమస్య మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

**ఆల్కహాల్..** ఆల్కహాల్ ఆర్థరైటిస్ లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. ఈ కారణంగా ఆర్థరైటిస్ లక్షణాలు ఉన్నవారు మద్యపానాన్ని పరిమితం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

**గుడ్డు అధికంగా తినొద్దు..** సాధారణంగా గుడ్డు తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందనేది మనందరికీ తెలిసిందే. అయితే, ఆర్థరైటిస్‌తో బాధపడేవారు గుడ్డును అధికంగా తినొద్దని సూచిస్తున్నారు నిపుణులు. గుడ్డు సొనలో అధిక స్థాయిలో అరాకిడోనిక్ యాసిడ్ ఉంటుంది. ఇది కీళ్లలో మంట కలిగిస్తుంది. అందుకే కొడిగుడ్లను మితంగా తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

**ఉప్పు తగ్గించాలి..** ఆహారాలలో ఉప్పు వినియోగాన్ని తగ్గించాలి. చీజ్, క్యాన్డ్ సూప్, రొయ్యలు, పిజ్జా, ప్రాసెస్ చేసిన ఆహారాలలో ఉప్పు శాతం ఎక్కువగా ఉంటుంది. వీటిని పరిమితంగా తీసుకోవాలి.

# 30 దాటాకా ముఖం డల్‌గా మారుతోందా?



30 ఏళ్ల తర్వాత చర్మ సంరక్షణ: 30 ఏళ్ల తర్వాత చర్మం కాంతి తగ్గడం ప్రారంభమవుతుంది. అందుకే ఈ వయసు తర్వాత చర్మానికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ వయసులో మహిళలు చర్మంపై పెద్దగా శ్రద్ధ చూపరు. అటువంటి పరిస్థితుల్లో 30 ఏళ్ల తర్వాత చర్మంలో లూజ్‌నెస్ ఏర్పడుతుంది, దాని వల్ల ముఖం అందం తగ్గిస్తుంది. 30ఏళ్లు పై బడినప్పుడు.. ముఖంపై ఫైన్ లైన్లు, రంధ్రాలు, డార్క్ పిగ్మెంట్లు, చర్మం నిస్తేజంగా కనిపిస్తుంది. చర్మం ఉత్పత్తి చేసే చర్మంలో నూనె లేదా సెబమ్ లేకపోవడంతో చర్మం పొడిబారిపోతుంది. ఇది చర్మంలో తేమ కారణంగా కూడా జరగవచ్చు. దానిని హైడ్రేట్ గా ఉంచడం చాలా అవసరం. దవడపై డార్క్ స్పాట్స్ మరియు మోటిమలు ఏర్పడుతుంటాయి. హార్మోన్ల వైవిధ్యాలు లేదా పెరిగిన ఒత్తిడి స్థాయిలు సెబమ్ అధిక ఉత్పత్తికి కారణమవుతాయి, దీని ఫలితంగా దవడ లైన్ మొటిమలు ఏర్పడతాయి. అప్పుడే మీరు మీ చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ప్రారంభించాలి. అందువలన ఈ సమయంలో చర్మం కోసం ప్రత్యేక శ్రద్ధ అవసరం.

మాయిశ్చరైజర్ వాడకం- 30 ఏళ్ల తర్వాత చర్మాన్ని మాయిశ్చరైజింగ్ చేయడం చాలా ముఖ్యం. మాయిశ్చరైజర్ చర్మానికి పోషణనిచ్చి చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. మీ చర్మ రకాన్ని బట్టి మాయిశ్చరైజర్‌ని ఎంచుకోండి. మాయిశ్చరైజర్‌ని ఉపయోగించడం వల్ల చర్మంలో తేమ అలాగే ఉంటుంది. ఇది ముడతల సమస్యను తొలగించడంలో సహాయపడుతుంది.

టోనర్ చర్మంపై టోనర్ ఉపయోగించడం చాలా ముఖ్యం. టోనర్ వాడకం వల్ల చర్మం లోపల ఉండే మురికిని శుభ్రపరుస్తుంది. చర్మం యొక్క pH స్థాయిని కూడా నిర్వహిస్తుంది. టోనర్ వాడకంతో చర్మం పొడిబారడం అనే సమస్య కూడా తొలగిపోతుంది. టోనర్ చర్మాన్ని శుభ్రపరచడం ద్వారా మెరిసేలా చేయడంలో సహాయపడుతుంది.

సీరం- సీరమ్ అప్లై చేయడం ద్వారా చర్మ కణాలు బాగుపడతాయి. రాత్రిపూట సీరమ్‌ను ఉపయోగించడం వల్ల అనేక చర్మ సమస్యల నుండి బయటపడవచ్చు. సీరమ్ చర్మానికి పోషణనిచ్చి మెరుస్తుంది.

సన్‌స్క్రీన్ ఉపయోగించండి- ముఖ సంరక్షణ కోసం సన్‌స్క్రీన్ ఉపయోగించడం అవసరం. సన్‌స్క్రీన్ ఉపయోగించడం వల్ల చర్మం దెబ్బతినకుండా చేస్తుంది.

# రోజూకు ఎంత మోతాదులో ఐరన్ అవసరం?




శరీర నిర్మాణం, ఎదుగుదలకు విటమిన్లు, మినరల్స్ చాలా అవసరం. ఈ పోషకాలన్నీ మనం తినే ఆహార పదార్థాల నుంచే లభ్యమౌతుంటాయి. ఆహారపు అలవాట్లు, జీవనశైలి సక్రమంగా లేకుంటే శరీరానికి కావల్సిన పోషకాలు దూరమై వివిద రకాల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతుంటాయి. ఈ పోషకాల్లో అతి ముఖ్యమైంది ఐరన్. ఐరన్ సరైన మోతాదులో ఉంటేనే శరీరం ఫంక్షనింగ్ బాగుంటుంది. బ్లడ్ సెల్స్ నిర్మాణంలో కూడా ఐరన్ కీలక పాత్ర వహిస్తుంది. ఐరన్ లోపముంటే ఎనీమియా లోపం తలెత్తవచ్చు. శరీరంలో ఐరన్ లోపిస్తే తీవ్రమైన అలసట ఉంటుంది. తరచూ గొంతెండిపోతుంటుంది. దాహం ఎక్కువగా వేస్తుంది. నీరసం ఆవహిస్తుంటుంది. హెయిర్ ఫాల్ ఎక్కువగా ఉంటుంది. గొంతులో గరగర ఎక్కువగా ఉంటుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తవచ్చు.

అయితే శరీరంలో ఐరన్ ఎంత మోతాదులో ఉండాలనేది ప్రధాన అంశం. ఇది పురుషులు, మహిళల్లో వయస్సుని బట్టి మారిపోతుంటుంది. పిల్లలతో పోలిస్తే యువకుల్లో ఐరన్ ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది. మహిళల్లో పీరియడ్స్ కారణంగా పురుషులతో పోలిస్తే ఎక్కువ కావల్సి ఉంటుంది.

4-8 ఏళ్ల పిల్లలకు రోజుకు 10 మిల్లీగ్రాముల ఐరన్ అవసరమౌతుంది. ఇక 9-13 ఏళ్లవారికి రోజుకు 8 మిల్లిగ్రాములు అవసరమౌతుంది. 19-50 ఏళ్ల మహిళలకు రోజుకు 18 మిల్లీగ్రాముల ఐరన్ కావాలి. అదే 19-50 ఏళ్ల పురుషులకైతే రోజుకు 8 మిల్లీగ్రాముల ఐరన్ సరిపోతుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే మెరుగైన ఆరోగ్యం ఉండాలంటే ఐరన్ తగిన మోతాదులో ఉండాల్సిందే. దీనికోసం ఐరన్ పుష్కలంగా లభించే బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్, తులసి, బెల్లం, ములక్కాయ, నువ్వులు, బీట్‌రూట్, ఉసిరి, నేరేడు, నిమ్మ, పిస్తా, దానిమ్మ, ఆపిల్, పాలకూర, డ్రై కిస్మిస్, అంజీర్, జామ, అరటి డైట్‌లో ఉండేట్టు చూసుకుంటే చాలు.

రోజుకో రకం డైట్‌లో ఉండేట్టు చూసుకుంటే ఐరన్ లోపం తీరడమే కాకుండా ఇతర పోషకాలు కూడా అందుతాయి.

# రోజూ ఉదయం ఈ జ్యూస్ తాగితే హైబీపీ తగ్గుతుంది



హైపర్‌టెన్షన్‌ను లెంట్ కిల్లర్ అని కూడా అంటారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మరణాలకు హై బీపీ కారణమవుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. బిజీబిజీ లైఫ్‌స్టైల్, ఒత్తిడి, చెడు ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్ల హైపర్‌టెన్షన్ సమస్య ఈ రోజుల్లో ఎక్కువైంది. చాలా సందర్భాలలో, హైపర్‌టెన్షన్ పేషెంట్స్ ఈ సమస్యను లైట్‌గా తీసుకుని సరైన చికిత్స తీసుకోరు. హైబీపీని కంట్రోల్‌లో ఉంచుకోకపోతే హార్ట్ ఎటాక్, పెరిఫెరల్ వాస్కులర్ డిసీజ్, కిడ్నీ వ్యాధి, గర్భధారణ సమయంలో సమస్యలు, కంటి చూపు కోల్పోవడం, స్ట్రోక్, వాస్కులర్ డిమెన్షియా వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. 80/120 %ఎఎంఎస్త్ర% ఉంటే.. హైపర్‌టెన్షన్ నార్మల్‌గా ఉన్నట్లు. జీవనశైలి మార్పులు చేసుకుని, మంచి డైట్ ఫాలో అయితే.. హైపర్‌టెన్షన్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రముఖ డైటీషియన్ శ్వేతా షా హై బీపీని కంట్రోల్ చేసే ఎఫెక్టివ్ హోం రెమెడీని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో బీట్‌రూట్ రసం తాగితే హైపర్‌టెన్షన్ కంట్రోల్‌లో ఉంటుందని శ్వేతా షా సూచించారు.

రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే.. సిస్టోలిక్ బ్లడ్ ప్రెజర్ యావరేజ్‌గా 4 నుంచి 5 పాయింట్లు తగ్గుతుంది.బీట్‌రూట్‌లో నేచ్యురల్‌గా . నైట్రేట్స్ ఉంటాయి. ఇవి శరీరంలోకి వెళ్లి నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. నైట్రిక్ ఆక్సైడ్ సహాయంతో.. రక్తాన్ని మోసే సిరలు రిలాక్స్ అవుతాయి. దీంతో హైపర్‌టెన్షన్ కంట్రోల్‌లో ఉంటుంది.

**ఎప్పుడు తాగాలి..?**

బీట్ రూట్ జ్యూస్‌ను ఎప్పుడైనా తాగొచ్చు. కానీ, ఉదయం ఖాళీ కడుపుతో, బ్రేక్‌ఫాస్ట్‌కు ఒక గంట ముందు బీట్ రూట్ జ్యూస్ తాగితే మంచి రిజల్ట్ పొందవచ్చు. బీట్ రూట్ జ్యూస్ తాగితే.. హైపర్‌టెన్షన్ కంట్రోల్ అవడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. హెల్త్‌లైన్ ప్రకారం, బీట్ రూట్ జ్యూస్ తాగితే.. స్టామినా పెరుగుతుంది. డిమెన్షియా, అధిక బరువు, కొలెస్ట్రాల్, లివర్ సమస్యలు దూరం అవుతాయి.

# ఈ నూనె వాసన చూస్తే మెనోపాజ్ సమస్యలకు చెక్ పడుతుంది



మెనోపాజ్.. చాలా సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా వచ్చిన నెలసరి ఆగిపోయే టైమ్. వరుసగా 12 నెలలు అంటే ఒక సంవత్సరం పాటు పీరియడ్స్ రాని స్త్రీలను మెనోపాజ్‌కు చేరుకున్నట్లు పరిగణిస్తారు. స్త్రీ పునరుత్పత్తి వయసు అయిపోయిందనడానికి ఇది సూచన. మెనోపాజ్ సాధారణంగా 47 నుంచి 53 సంవత్సరాల లోపు ఈ ప్రక్రియ జరుగుతుంది. మెనోపాజ్ యావరేజ్ వయసు 51 సంవత్సరాలు. మెనోపాజ్‌కి 5-7 సంవత్సరాలకు ముందు నుంచే మహిళల శరీరంలో కొన్ని మార్పుల వస్తూ ఉంటాయి. హార్మోన్ల స్థాయి కూడా నెమ్మదిగానే తగ్గుతుంది. ఆ సమయంలో పిట్యూటరీ గ్లాండ్ నుంచి గొనడోట్రోపిన్ లాంటి హార్మోన్ల విడుదల ఎక్కు శారీరకంగా మార్పులు జరుగుతాయి. అండాశయాల నుంచి హార్మోన్ల విడుదల ఆగిపోవడం, ముఖ్యంగా ఈస్ట్రోజెన్ స్థాయి తగ్గడం వల్ల కొన్ని సమస్యలు కనిపిస్తూ ఉంటాయి. ఈ సమయంలో హార్మోన్లలో వచ్చే తేడాల కారణంగా శారీరక మార్పులు, మానసిక ఒత్తిడి, మూడ్ స్వింగ్స్, ఇతర సమస్యల వల్ల అలసట, నీరసం.. వంటివి తలెత్తుతాయి. ఈ సమయంలో శరీరం నుంచి వేడి ఆవిర్లు, రాత్రి సమయాల్లో చెమటపట్టి నిద్రకు దూరంకావడం వంటి సమస్యలూ ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఈ లక్షణాలు వారి రోజూ వారీ పనితీరును ప్రభావతం చేస్తాయి.

మెనోపాజ్ లక్షణాల నుంచి ఉపశమనం పొందడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఎసెన్షియల్ ఆయిల్స్ మెనోపాజ్ లక్షణాలను తగ్గించడానికి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నూనెలు హార్మోన్లను సమతుల్యం చేయడంలో, కార్టిసాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అమెరికన్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ జోసెఫ్ మెర్కోలా మెనోపాజ్ లక్షణాల నుంచి ఉపశమనం ఇచ్చే కొన్ని ఎసెన్షియల్ ఆయిల్స్‌ను మనతో పంచుకున్నారు. మెనోపాజ్ దశకు చేరుకున్న మహిళలు, ఈ ఎసెన్షియల్ ఆయిల్స్ వాసన చూస్తే మంచిదని అన్నారు.

క్లారీ సేజ్ ఆయిల్ PMS నొప్పిని, వేడి ఆవిర్లను తగ్గిస్తుంది. మానసిక ఒత్తిడి, మూడ్ స్వింగ్స్ కంట్రోల్ చేస్తుంది. క్లారీ సేజ్ ఆయిల్ వాసన చూస్తే హార్మోన్ల సమతుల్యతను మెరుగుపడుతుంది. మీరు మెనోపాజ్ లక్షణాలతో ఇబ్బంది పడుతుంటే.. మీరు స్నానం చేసే నీళ్లలో 2 లేదా 3 చుక్కలు క్లారీ సేజ్ ఆయిల్ వేసుకుని స్నానం చేస్తే మంచి రిజల్ట్స్ ఉంటాయి.

**జెరేనియం ఆయిల్..** జెరేనియం ఆయిల్.. హార్మోన్లను సమతుల్యం, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ప్రీమెనోపాజ్ సమయంలో నెలసరి సక్రమంగా వచ్చేలా చేస్తుంది. మీకు ఒత్తిడి నుంచి వెంటనే రిలీఫ్ రావాలంటే.. మీ కర్చీఫ్‌లో రెండు చుక్కల జెరేనియం ఆయిల్ వేసుకుని పీల్చండి.

**లావెండర్ ఆయిల్..** మెనోపాజ్ సమయంలో సంభవించే హార్మోన్ల మార్పుల వల్ల నిద్ర సమస్యలు, డిప్రెషన్ ఎక్కువ అవుతాయి. లావెండర్ ఆయిల్ నిద్రను ప్రోత్సహిస్తుంది, మిమ్మల్ని రిలాక్స్ చేస్తుంది. లావెండర్ ఆయిల్ హార్మోన్లను సమతుల్యం చేయడానికి, ఇన్ఫ్లమేషన్ తగ్గించడానికి సహాయపడుతుంది. లావెండర్ ఆయిల్ వాసన పీలిస్తే.. మెనోపాజ్ వల్ల వచ్చే తలనొప్పి, గుండె దడ తగ్గుతాయి.

పైన్ ఆయిల్ ఎముకల నష్టాన్ని తగ్గించడానికి, ఆస్టియోపోరోసిస్ సమస్య నుంచి రక్షిస్తుంది. పైన్ బెరడు సారం ఆక్సిడేషన్ ఒత్తిడి, వేడి ఆవిర్లను తగ్గిస్తుంది.

**రోజ్ ఆయిల్..** ఈ నూనె గర్భాశయాన్ని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. రోజ్ ఆయిల్ మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. వేడి ఆవిర్లను తగ్గిస్తుంది. ఈ నూనె హైపర్‌టెన్షన్‌ను తగ్గించడంలోనూ సహాయపడుతుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. రోజ్ ఆయిల్ వాసన చూస్తే.. మీకు ప్రశాంతంగా నిద్రపడుతుంది.

# రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

### గ్రామస్థులలో జోష్ నింపిన కొణతాల ప్రసంగం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని శంకరం, రేబాక గ్రామాల్లో బుధవారం జరిగిన తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి అభ్యర్థి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ , ఎంపీ తనయుడు రుత్విక్ లకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ , బుద్ధ నాగ జగదీష్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కరణం పవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ జనసేన పేరుతో నేను గెలిచిన సరే తెలుగుదేశానికే ముఖ్య ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఒక్క ఛాన్స్ అని అడిగి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారు. అలాగే మన ప్రాంతంలో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉన్నప్పటికీ వైసీపీ ఎమ్మెల్యే అమర్నాథ్ పారిశ్రామిక మంత్రిగా ఉన్నప్పటికీ ఒక పరిశ్రమను కూడా తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని అలాగే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వృద్ధాప్య పెన్షన్ 4000 రూపాయలు ఇస్తూ మార్చి ఏప్రిల్ మే నెలలో బ్యాలెన్స్ వెయ్యి రూపాయలు ఏదైతే ఉందో అది కలుపుకొని 7000 రూపాయలు జులై నెలలో మీకు అందజేయడం జరుగుతుందని మన దగ్గర రూపాయిలు టాక్సు మద్యం రూపంలో వసూలు చేసి మనకు పైసలు రూపంలో సంక్షేమ పథకాలు ఇస్తున్నాడని ఆడపడుచులు అందరూ ఇది గ్రహించాలని తెలిపారు. మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని వారికి తోడుగా పవన్ కళ్యాణ్ ఆశయాలు సిద్ధాంతాలు ఆలోచనలు తోడైతే కేంద్రం నుంచి పరిశ్రమలను తీసుకొచ్చి మీ పిల్లలకు మంచి భవిష్యత్తును ఇచ్చే ఉద్యోగ భద్రత కలుగుతుందని తెలిపారు. ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ కుమారుడు రిత్విక్ మాట్లాడితే ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఎం రమేష్ ను ఎంపీగా గెలిపిస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు తీసుకొస్తారన్నారు. మోడీ



ప్రధానిగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వస్తే రాష్ట్ర సుభిక్షంగా ఉంటుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి నియోజవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణకు గాజు గ్లాస్ గుర్తుపై ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కు కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు శంకరంకరణం పవన్ కుమార్ , బొండా లక్ష్మీనారాయణ , కుర్రు లక్ష్మణ్ , కరణం సన్యాసిరావు , జీకే రాజు , మునస గోవిందరాజు , దేవర అప్పలనాయుడు , మాటూరు లోకేష్ , పెద్ద ఎత్తున మహిళలు , నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్నిగుండంలో నడిచిన తాకాశి వీధి నూకాంబిక మాలధారులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి లో ప్రసిద్ధి చెందిన తాకాసి వీధి శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర,కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారి మాల ధారణ ధరించిన భక్తులు దీక్ష పూర్తి అవడంతో ఇరుముడికట్టుకొని పట్టణములో ఊరేగింపు ఘనంగా నిర్వహించి తిరిగిఆలయ వద్ద కు చేరుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంకి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి పట్ల భక్తిశ్రద్ధలతో అగ్నిగుండంలో నడుచుకుంటూ వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో తాకాశి రాజేష్ ,తాకాశి కన్నబాబు ,తాకాశి చందు, తాకాశి వీధి పెద్దలు యూత్, యువకులు, మహిళలు పాల్గొన్నారు,

# జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శప్రాయం, చిరస్మరణీయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సమాజ శ్రేయస్సుకు నిరంతరం పాటుపడుతూ, ఈ దేశానికి జ్యోతిరావు పూలే చేసిన సేవలు అందరికీ ఆదర్శప్రాయమని, స్ఫూర్తిదాయకమని, చిరస్మరణీయమని జీవీఎంసి అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకల సందర్భంగా జీవీఎంసీ అధికారులతో కలిసి వారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే 11 ఏప్రిల్ 1827 మహారాష్ట్ర పూణా లో జన్మించారన్నారు. పూలే మహారాష్ట్రానికి చెందిన భారతీయ సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త, కుల వ్యతిరేక సంఘ సంస్కర్త మరియు రచయితని, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన మరియు మహిళలు, అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయన చేసిన కృషి అనేక రంగాలకు విస్తరించిందన్నారు. పూలే, అతని భార్య సావిత్రీబాయి పూలే భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శకులని, పూలే తన మొదటి బాలికల పాఠశాలను 1848లో పూణేలో తాత్యాసాహెబ్ భిడే నివాసం భిదేవాడలో ప్రారంభించారన్నారు. అతను తన అనుచరులతో కలిసి సత్యశోధక్ సమాజ్ ని స్థాపించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సంఘంలో అన్ని మతాలు, కులాల వారు భాగస్వాములు కావచ్చునని పిలుపునిచ్చారన్నారు. మహారాష్ట్రలోని సాంఘిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డారన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్లు డాక్టర్ వై .శ్రీనివాస రావు, ఎస్.ఎస్.వర్మ, ప్రధాన ఇంజనీర్ పి.రవి కృష్ణ రాజు, సెక్రటరీ నల్లనయ్య, యుసిడి ప్రాజెక్ట్ అధికారులు డి.లక్ష్మి, బి.రమణమ్మ, డిపిఒ ఎం.వి.డి ఫణిరామ్, కార్య నిర్వాహక ఇంజనీర్ మోహన్ రావు, ఆఫీస్ ఇంచార్ పి.వి.సత్యనారాయణ, ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతి పూలే జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని ప్రధానోపాధ్యాయులు దేవరశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. నేడు అనకాపల్లి మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల లో గురువారం మహాత్మ జ్యోతిబా పూలే 197వ జయంతి ఘనంగా జరిగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల పాఠశాలల లక్ష్యం ఆయన ఆశయాలే, మహారాష్ట్రలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన జ్యోతిబాపూలే వర్ణ వ్యవస్థతో కునారిల్లుతున్న సమాజానికి సంస్కారం నేర్పారని కొనియాడారు. అణగారిన వర్గాల ఎదుగుదలకు విద్య సరైన ఆయుధమని భావించి పాఠశాలలు నెలకొల్పారని, స్త్రీ విద్యను ప్రోత్సహించారని, బాల్య వివాహలను వ్యతిరేకించి, వితంతు పునర్వివాహానికి నాంది పలికారని వివరించారు. అన్ని వర్గాల వారికి విద్య, ఉపాధి, రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారని వివరించారు.తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ మాట్లాడుతూ వెనకబాటు, కులతత్వం తదితర అనేక కారణాల వల్ల భారతీయ సమాజం ఇతర సమాజాల కంటే సంక్లిష్టమైందన్నారు. గౌతమ బుద్ధుడు మొట్టమొదట్టి సామజిక విప్లవకారుడని, తరువాతకాలంలో మహాత్మ జ్యోతిబాపూలే సామజిక విప్లవకారుడిగా అవతరించి బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. అసిస్టెంట్ ప్రిన్సిపల్ మహేంద్ర నాథ్ పట్నాయక్ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిబాపూలే భారతదేశంలో మహోన్నత సంఘసంస్కర్త అని, పూలే దంపతులు సమాజం కోసం తమ జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సుహాసిని, అధ్యాపకురాలు మోతీబాయి, వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్ మోహన్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటింటి ప్రచారంలో కొణతాల కు హారతులు పట్టిన మహిళలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక జీవీఎంసీ 84 వ వార్డు కోట్ని వీధిలో గురువారం ఉదయం తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ , ఉమ్మడి బిజెపి ఎంపీ అభ్యర్థి తనయుడు రిత్విక్ గడపగడపకు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణకు ప్రజలు పూల వర్షం కురిపిస్తూ అడుగడుగునా హారతులు ఇస్తూ ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగు జగదీష్ బిజెపి నాయకులు పొన్నగంటి అప్పారావు పాల్గొని రామకృష్ణ రిత్విక్ లతో పాటుగా వచ్చే ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే మనకు జరిగే అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రజలకు వచ్చే సంక్షేమ పథకాలు కోసం వివరిస్తూ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి గ్లాస్ గుర్తుపై ఓటు వేయాలని అలాగే ఎంపీ అభ్యర్థిగా కమలం పువ్వు గుర్తుపై ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి సెంటర్లో ఉన్నటువంటి మోదకొండ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం కోట్ని వీధి కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఈ గడపగడపకు కార్యక్రమంలో కోట్ని రామకృష్ణ , కోట్ని కొండలరావు , తలారి లక్ష్మీప్రసాద్ , కోట్ని సూరిబాబు , దొడ్డి నాగు , కోట్ని అయ్యన్న దొర , గేదెల స్వరూప్ పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# హోరెత్తిన భరత్ ఎన్నికల ప్రచారం

### భరత్ కుమార్ కు అడుగడుగున నీరాజనాలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ కి అనకాపల్లి ప్రజలు సంఘీభావం ఘన స్వాగతం పలికారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక 80 వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళి కృష్ణ నేతృత్వంలో వార్డులో బుధవారం ఎన్నికల ప్రచారం విస్తృతంగా జరిగింది ముందుగా గవరపాలెం చిన్న రామస్వామి గుడిలో సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం చిన్నరామస్వామి కోవెల నుంచి మొదలుకొని వేలంపీధి,శతకంపట్టు వరకు ప్రచారం లో పాల్గొన్నారు. ప్రచార స్థలానికి చేరుకోగానే మహిళలు, స్థానిక నాయకులు భరత్ కు ఘన స్వాగతం పలికారు ప్రచారంలో భాగంగా భరత్ గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు ఈ ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు గడప గడపలో మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి భరత్ కు హరతులు ఇచ్చారు.మార్గ మధ్యలో అవ్వా తాతలను పలకరిస్తూ వారి యోగ క్షేమాలని అడిగి తెలుసుకుని తనను దీవించాలని భరత్ విజ్ఞప్తి చేశారు. విద్యావంతుడైన నన్ను దీవించి ఎమ్మెల్యేగా చేస్తే అనకాపల్లి ని అభివృద్ధి చేస్తానని, ప్రజలందరికి అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా పరిష్కారిస్తానని చెప్పారు.తామంతా మీకు సహకరిస్తా మంటూ భరత్ కు భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాలకు, మరీ ముఖ్యంగా మహిళలకు చేసినంత మేలు మరే ముఖ్యమంత్రి చేయలేదు అన్నారు.ఎన్నికలలో వైసీపీ విజయం సాధించి, జగన్మోహన్ రెడ్డి ని మరొకసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని సూచించారు అప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి సుస్థిరమవు తుందని ఆయన చెప్పారు. మే 13 న జరగబోయే ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి గా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గా మలసాల భరత్ కుమార్ ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ప్రజలను కోరారు...

ఈకార్యక్రమంలోవిల్లూరిశివసూరి,స వార్య నారాయణమూర్తి స్వామి దేవస్థానం చైర్మన్. కేఎం నాయుడు, నూకంబికా దేవస్థానం డైరెక్టర్ బుద్ధ నర్సింహా రాజు,డి. నర్సింగరావు, ఎల్లపు చంద్రమోహన్,కొణతాలల కృష్ణం రాజు, పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, భోగలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఆళ్ళ నాగేశ్వరావు,భోగలింగేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్ రాము,,జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ మున్నూరు శ్రీను, రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ కాండ్రేగుల యశ్వంత్, రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి లక్ష్మి నారాయణ ,దాడి నారాయణరావు, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు ఉగ్గిన అప్పారావు వేగి త్రినాధ్, కర్రి రుద్రి నాయుడు, దాడి నారాయణ రావు,పెంటకోట అప్పలనాయుడు, పెంటకోట శ్రీను, కోరిబిల్లి యుగంధర్, దూదుల వాసు,శివ,నాయుడు నూకం బిక అమ్మవారి దేవస్థానం డైరెక్టర్లు మారిశెట్టి శ్రీనివాసరావు, పీలా శ్రీనివాసరావు, కాండ్రేగుల రాము పార్టీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యవరంలో భరత్ కుమార్ ముమ్మర ప్రచారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల ప్రచారంలో భాగంగా కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారంలో పాల్గొన్నారు. రోజు రోజుకు భరత్ కు విశేష స్పందన లభిస్తోంది. ప్రచార స్థలానికి చేరుకోగానే మహిళలు,పెద్దలు, స్థానిక నాయకులు భరత్ కు ఘన స్వాగతం పలికారు ప్రచారంలో భాగంగా భరత్ గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు ఈ ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు గడప గడపలో మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి భరత్ కు హరతులు ఇచ్చారు.మార్గ మధ్యలో అవ్వా తాతలను పలకరిస్తూ వారి యోగ క్షేమాలని అడిగి తెలుసుకుని తనను దీవించాలని భరత్ విజ్ఞప్తి చేశారు. విద్యావంతుడైన నన్ను దీవించి ఎమ్మెల్యేగా చేస్తే అనకాపల్లి ని అభివృద్ధి చేస్తానని, ప్రజలందరికి అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా పరిష్కారిస్తానని చెప్పారు.తామంతా మీకు సహకరిస్తామంటూ భరత్ కు భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాలకు, మరీ ముఖ్యంగా మహిళలకు చేసినంత మేలు మరే ముఖ్యమంత్రి చేయలేదు అన్నారు.ఎన్నికలలో వైసీపీ విజయం సాధించి, జగన్మోహన్ రెడ్డి ని మరొకసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని సూచించారు అప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి సుస్థిరమవుతుందని ఆయన చెప్పారు. మే 13 న జరగబోయే ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి గా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గా మలసాల భరత్ కుమార్ ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్ ,ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, ఎంపిటిసి గొన్న నాగ సత్యనారాయణ, గొల్లవిల్లి నానాజీ, గొల్లవిల్లి బాబురావు, నార్ని శ్రీనివాసరావు,బరుకు హరీష్, చోడి నాగరాజు, జనపరెడ్డి అప్పారావు,అగ్గాల శ్రీను, సిద్ధ శ్రీను మరియు చుట్టుపక్క గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లవేళలా సేవ చేసే వ్యవస్థ సిఆర్పిఎఫ్



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రజలకు రక్షక భటులుగానే గాక, వారికి అవసరమైన సమయంలో తమకు తోచిన విధంగా సహాయపడటం లోను సీ అర్ పి ఎఫ్ పోలీసు వ్యవస్థ ముందుంటుందని సీ ఆర్ పీ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత అన్నారు. అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సిఆర్పిఎఫ్ బి 234 పటాలానికి చెందిన కమాండెంట్ సంజీవ్ కుమార్ ద్వివేది ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం మండలంలోని ఏజెన్సీ అన్నవరంలో గల శ్రీ సత్యనారాయణ ఆలయం చెంత రక్షిత త్రాగునీరు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ ప్రజలకు రక్షణ వ్యవస్థ గానే గాక, ప్రజలకు అవసరమైన ప్రతి కార్యక్రమంలోనూ భాగస్వాములు అవుతున్నామన్నారు. అందులో సిఆర్పిఎఫ్ మరో అడుగు ముందుకు వేసి ప్రస్తుతం వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం రక్షిత త్రాగునీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ పోలీసు సిబ్బంది, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలిపిన ఎస్పీ కేవీ మురళి కృష్ణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 రోజులపాటు కఠినమైన ఉపవాస దీక్షలు చేసి వాటిని విరమించిన ముస్లిం సోదరులు, సోదరీమణులు ఈరోజు ప్రశాంతమైన వాతావరణం లో 'ఈద్ ఉల్ ఫితర్' జరుపుకునేందుకు జిల్లాలోని అన్ని మసీదులు, దర్గాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఈ రంజాన్ సందర్భంగా అందరి మంచినీ కోరుకుంటూ, అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని, జిల్లాలోని ముస్లిం సోదరులు, సోదరీమణులు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి, పాత్రికేయ మిత్రులు మరియు వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ "ఈద్ ముబారక్" తెలియజేసినారు.

# మహాత్మ జ్యోతిరావు పూలేకి ఘన నివాళి



**విజయనగరం:** మహాత్మా జ్యోతిరావు పూలేకి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో పూలే 198 వ జన్మదినం గురువారం ఘనంగా జరిగింది. పూలే చిత్రపటానికి కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు జాతికి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎస్డి అనిత, డిఆర్డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, డిబిసిడబ్ల్యూఓ సందీప్‌కుమార్, వసతిగృహ సంక్షేమాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెరుగైన ఉచిత వైద్య సేవలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ వారు ప్రతి నెల రెండవ గురువారం, వన్ టౌన్ నందు గల శ్రీ స్వామి వివేకానంద సంస్థ నందు ఉచితంగా B.P, షుగర్ చెకప్ చేసి, ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఈరోజు డాక్టర్ సూర్యతేజ గారి ఆధ్వర్యంలో బీపీ షుగర్ తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గారు మాట్లాడుతూ ఎండలు చాలా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, సమయానికి భోజనం చేస్తూ, మందులు వేసుకోవాలని, శరీర వ్యాయామం కూడా చేయాలని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పుండరీకాక్షయ్య గారు, ప్రసాద్ నాయుడు , కమల ప్రియ, అనూష, మౌనిక రవి మొదలైన వారు పాల్గొన్నారు.

# బుల్లిబాబు వద్దు... సుబ్బారావే ముద్దు



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో కనుమరుగై పోతుందను కుంటున్న కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో తన భుజస్కంధాలపై వేసుకుని బలోపేతం చేసిన వంతల సుబ్బారావును కాంగ్రెస్ పార్టీ పాడేరు నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలు నేడు కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని శతక బుల్లిబాబును అభ్యర్థిగా ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేని విషయమని దీనిపై పార్టీ పునరాలోచన చేయాలని ఆ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ పాంగి రామకృష్ణ, లీగల్ అడ్వైజర్ సింహాద్రి, యు డబ్ల్యు ఈ సి అరకు పార్లమెంట్ అధ్యక్షుడు శ్రీనుబాబు లు అన్నారు. అన్నవరం గ్రామంలో ఆ పార్టీ శ్రేణులతో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో జరిగిన ఎన్నికలలో రాష్ట్రంలోనే గాక దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పరాజయాలను మూటగట్టుకుని తేరుకోలేని స్థితికి చేరుకున్న సందర్భంలో ఆ పార్టీలోని పెద్దపెద్ద నాయకులు సైతం ఇతర పార్టీలకు వెళ్లిపోయినప్పటికీ కష్టకాలంలో పార్టీని వేడకూడదన్న శుభసంకల్పంతో వంతల సుబ్బారావు పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైపోతుంది అనుకున్న సమయంలో పాడేరు నియోజకవర్గంలో నేనున్నానంటూ ముందుకు వచ్చి పార్టీని తన భుజస్కందాలపై వేసుకున్న నాయకుడు వంతల సుబ్బారావు అన్నారు. ఆయన చిత్తశుద్ధిని గ్రహించిన పార్టీ అధిష్టానం 2024 సార్వత్రిక ఎన్నికలలో సుబ్బారావే తమ పార్టీ అభ్యర్థి అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పనిచేసిన సాకే శైలజానాథ్, గిడుగు రుద్రరాజు, ప్రస్తుత పిసిసి అధ్యక్షురాలైన షర్మిల తో సహా ప్రతి ఒక్కరూ బహిరంగంగా ప్రకటించారన్నారు. నేడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీకి సంబంధం లేని వ్యక్తి పార్టీలో చేరి పైరవీలు చేస్తూ తనకే అభ్యర్థిత్వం ఖరారు అయిందని చెప్పుకోవడం, అదేవిధంగా పార్టీ ప్రకటన చేయడం తాము జీర్ణించుకోలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పార్టీ సభ్యత్వం లేని వ్యక్తికి టిక్కెట్టు ఖరారు చేయడం మంచిది కాదని, పార్టీని నమ్ముకుని పనిచేసిన వ్యక్తులను విస్మరించరాదన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఆడిన మాట తప్పి ఆదివాసీలకు అన్యాయం చేయవద్దని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జి మాడుగుల మండల కోఆర్డినేటర్ కె లక్ష్మణరావు, మువ్వల భాస్కరరావు, పాంగి అప్పారావు, వంతల కోటి బాబు, అధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నగదు రూ.50వేలు కంటే ఎక్కువ ఉంటే సీజ్



**విజయనగరం:** తనిఖీల్లో రూ.50వేలు కంటే ఎక్కువ నగదు లభిస్తే వెంటనే సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఈ నగదు ఎన్నికలకు సంబంధించినది తేలితే, వెంటనే సీజ్ చేసి, కేసు నమోదు చేయాలని, ఎన్నికలతో సంబంధం లేకపోతే, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి నివేదించాలని సూచించారు. స్వాధీనం చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను నమోదు చేసి, వాటి యజమానికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. సీజ్ చేసుకున్న నగదు లేదా వస్తువుల వివరాలను ఇఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ఆర్ఓలు, ఏఆర్ఓలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టేటిక్ స్క్వాడ్స్ సభ్యులతో కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఆయా బృందాల పనితీరు, నమోదు చేసిన కేసులపై కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ విస్తృతంగా పర్యటించాలన్నారు. నగదు, వస్తువులను సీజ్ చేసేటప్పుడు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ఎక్కడైనా అనధికారికంగా రూ.50వేలు కంటే ఎక్కువ నగదును తరలిస్తున్నప్పుడు, వారి దగ్గర నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోతే సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి నివేదించాలని సూచించారు. జెడ్‌పి సిఇఓ ఆధ్వర్యంలోని ఈ కమిటీ రోజుకు రెండుసార్లు సమావేశమై, సీజ్ చేసుకున్న నగదు, వస్తువులపై వారివద్దనున్న ఆధారాలను, పత్రాలను పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కమిటీ ఆదేశాల ప్రకారం కేసు నమోదు చేయడం లేదా, నగదును విడిచిపెట్టడం జరుగుతుందన్నారు. నగదు లేదా వస్తువులు రాజకీయ పార్టీలకు సంబంధించివని తేలితే, వెంటనే సీజ్ చేసి కేసు నమోదు చేయాలని, కమిటీకి తెలియజేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రూ.10వేలు కంటే విలువైన బహుమతులను, తగిన పత్రాలు లేకపోతే సీజ్ చేయవచ్చునని చెప్పారు. రూ.10లక్షలు కంటే ఎక్కువ విలువైన నగదు, లేదా వస్తువులను గుర్తిస్తే ఇఎస్ఎంఎస్‌లో నమోదు చేసి, వివరాలను ఆదాయపు పన్నుశాఖకు పంపించాలని ఆదేశించారు. అలాగే బంగారు ఆభరణాలకు సంబంధించి వివాహిత మహిళ 500 గ్రాముల ఆభరణాలను, ఇతర మహిళలు 250 గ్రాముల ఆభరణాలను, పురుషులు 100 గ్రాముల ఆభరణాలను తమ వెంట తీసుకువెళ్లవచ్చునని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, జెడ్‌పి సిఇఓ శ్రీధర్ రాజా, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే వైసీపీ తప్పుడు ప్రచారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిఎం రమేష్ సోదరుడు సీఎం రాజేష్ పై మంగళవారం అనకాపల్లి లో కొన్ని వాట్సప్ గ్రూపులు,సామాజిక మాధ్యమాలలో ఫేక్ న్యూస్ వైరల్ కావడం పట్ల టిడిపి నాయకులు,మాజీ ఎమ్ ఎల్ ఏ పీలా గోవింద సత్యనారాయణ, జిల్లా బిజెపి అధ్యక్షులుద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఎం పి అభ్యర్థి సి ఎమ్ రమేష్ కుమారుడు రిత్విక్ లు తీవ్రంగా ఖండించారు.బుధవారం అనకాపల్లి లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక వైసిపి నాయకుల ప్రోద్బలంతోనే ఇటువంటి అసత్య కథనాలు వ్యాప్తి అవుతున్నాయని అన్నారు. అసత్య ప్రచారం ద్వారా బురదజల్లి లబ్ధి పొందాలని చూస్తున్న వైసీపీ పార్టీ నేతలపై అనకాపల్లి ఎస్పీ కి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఓటమి భయంతో వైసీపీ చేస్తున్న కుట్రలో భాగం కావొద్దని పత్రికా ముఖంగా ప్రజలను కోరారు.ఇలాంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని,ఇటువంటి కుట్రలను తిప్పి కొట్టాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నామనిపేర్కొన్నారు.ఇటువంటి తప్పుడు రాతలు వ్రాసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి అసత్య ప్రచారాల పట్ల బీజేపీ,టీడీపీ,జనసేన నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు.వీటిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

# గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మహాత్మా జ్యోతిరావ్ పూలే గొప్ప సంఘ సంస్కర్తగా నాటి సమాజంలోని అసమానతలను పారద్రోలడానికి ఎనలేని కృషి చేసిన మహనీయుడని అనకాపల్లి పార్లమెంట్ బిజెపి, టిడిపి,జనసేన ఉమ్మడి అభ్యర్థి సి ఎం రమేష్ అన్నారు. అనకాపల్లి లో గురువారం ఉదయం మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఎం రమేష్ ముందుగా మహాత్మా జ్యోతీరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చిన్న తనంలో జ్యోతీరావు పూలే అనుభవించిన అంటరానితనం,మనుషుల మధ్య అంతరాలు,మూఢనమ్మకాలు వంటి దురాచారాలను అంతం చేయడానికి గొప్ప కృషిచేసి మహాత్మా బిరుదుతో మహాత్మా జ్యోతీరావ్ పూలేగా వినుతికెక్కారని కొనియాడారు.స్త్రీ విద్యకోసం ఆనాడే కృషి చేసిన మహనీయుడని అన్నారు. అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమ సమాజ నిర్మాణం కోసం ఎంతో పాటు పడ్డారని అన్నారు. కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్సీ పివియన్ మాధవ్ ,పీలా ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ నాగజగదీష్ బిజెపి జిల్లా అధ్యక్షుడు ,ద్వారంరెడ్డి పరమేశ్వరావు,సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలేకి కలెక్టర్ ఘన నివాళి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహాత్మా జ్యోతిరావు పూలేకి జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాలులో పూలే 198వ జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. రామారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే సమాజానికి అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వసతిగృహాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ చలివేంద్రానికి ఆదరణ



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండలం కేంద్రమైన పరవాడ సినిమా హాల్ జంక్షన్ లో పెరిగిన ఎండల తీవ్రత దృష్ట్యా స్థానిక శ్రీ పైడిమాంబ వెల్డింగ్ షాపు వద్ద ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రానికి ఆదరణ లభిస్తుంది. గురువారం కీర్తిశేషులు బోద్దపు గంగునాయుడు జ్ఞాపకార్థంగా బోద్ధపు అయ్యబాబు (ఆటో స్పేర్స్), బెజవాడ పెంటినాయుడు (వెల్డింగ్ షాప్) ఆధ్వర్యంలో ధన సహాయం చేశారు. ఇదేవిధంగా ప్రతి ఏడాది చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వందలాది మంది దాహాన్ని తీరుస్తున్న వీరి సేవలను స్థానికులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో గంట్ రెడ్డి గణేష్,వడ్డాది రమేష్,బి.గోపాల్ రెడ్డి, ఏ.శివ, సిహెచ్.రవి, ఏ.జానీ రాంబాబు ,జి.కనకం, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ దక్షిణం లో ఎన్నికల వేళ రాజకీయ ప్రత్యర్థుల ఆత్మీయ ఆలింగనం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖలో ప్రత్యర్థుల ఆత్మీయ ఆలింగనం వారిద్దరూ రాజకీయ ప్రత్యర్థులు. ఒకే నియోజకవర్గం నుంచి ఒకరు వైసీపీ తరపున.. మరొకరు జనసేన నుంచి పోటీ పడుతున్నారు. దక్షిణ నియోజకవర్గంలో పోటాపోటీగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, అదే నియోజకవర్గంలో నుంచి పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి వంశీకృష్ణ యాదవ్ వన్ టౌన్ ఏరియా మసీదులో ఎదురుపడటంతో ఒకరికొకరు పలకరించుకుని ఆలింగనం చేసుకున్నారు. కొన మెరుపు ఎవరు గెలుస్తారో ఈ ఎన్నికల సంగ్రామంలో తేలనుంది.

# పలు రైళ్లు రద్దు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రీ-నాన్ -ఇంటర్లాకింగ్, నాన్ -ఇంటర్లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తునట్లు రైల్వే శాఖ అధికారి ఏ.కె. త్రిపాఠి తెలిపారు. 08527 విశాఖ- రాయ్ పూర్, 08528 రాయ్పూర్ - విశాఖ, 08504 విశాఖ-భవానీపట్నం ప్యాసింజర్, 18301 సంబల్పూర్ - రాయగడ, 18302 రాయగడ -సంబల్పూర్ ఇంటర్ సిటీని ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు... 08503 భవానీపట్న-విశాఖ ప్యాసింజర్ ఈనెల 16 నుంచి 25వ వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

# హెక్టర్ బ్లాక్ స్టోమ్‌ను ప్రవేశపెట్టిన ఎంజి మోటార్ ఇండియా




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎంజి (మోరిస్ గ్యారేజెస్), 100 ఏళ్ల చరిత్ర కలిగిన బ్రిటిష్ ఆటో మొబైల్ బ్రాండ్, ఈరోజు భారతదేశంలో ఎంజి హెక్టర్ యొక్క బ్లాకార్క్ ఎడిషన్‌ను ప్రారంభించింది. ఎంజి హెక్టర్ బ్లాక్ స్టోమ్ స్టార్రి బ్లాక్ బాహ్య రంగు బ్లాక్ థీమ్ ఇంటీరియర్లను కలిగి ఉంది, ఇది భారతదేశ ప్రారంభ ఇంటర్నెట్ ఎస్యూవి యొక్క కమాండింగ్ లక్షణాలను ప్రతిబింబిస్తుంది. టెక్ కనెక్ట్ చేయబడిన ఫీచర్ల శ్రేణితో ప్యాక్ చేయబడీ, హెక్టర్ బ్లాక్స్ దాని విలక్షణమైన సౌందర్యంతో, ఎస్యూవి ఔత్సాహికులకు అసమానమైన శక్తి మరియు లగ్జరీని అందిస్తుంది. దాని విభాగం మరియు విలక్షణమైన డిజైన్ అంశాలలో ప్రముఖ ఆఫర్లతో, హెక్టర్ బ్లాక్స్ ఎడిషన్ 5, 6 మరియు 7-సీటర్ కాన్ఫిగరేషన్లలో అందించబడుతుంది. ఎంజి హెక్టర్ బ్లాక్ స్టోమ్ ప్రారంభ ధర రూ. 21.24 లక్షలు (ఎక్స్-షోరూమ్).

డార్క్, క్లెమ్ బ్రాండ్ లోగోలు, డార్క్, క్రోమ్ ఆరైల్ ప్రేరేపిత డైమండ్ మెష్ ఫ్రంట్ గ్రిల్, స్కిడ్ ప్లేట్లపై డార్క్ క్రోమ్ ఇన్సర్లు, డార్క్, క్రోమ్ టెయిలెట్ వంటి డార్క్ క్రోమ్ ఎలిమెంట్స్ ద్వారా హెక్టర్ బ్లాక్ స్టోమ్ దాని బోల్డ్ మరియు డైనమిక్ బ్లాక్ సౌందర్యంతో, బాడీ సైడ్ క్లాడింగ్లో డార్క్ క్రోమ్ ఫినిష్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. రెడ్ కాలిపర్లతో కూడిన ఆర్18 స్పోర్టీ ఆల్ బ్లాక్ అల్లాయ్లు, పియానో బ్లాక్ రూఫ్ రైల్స్ పియానో బ్లాక్ బెజెల్‌తో కూడిన ఎల్ఇడి హెడ్ ల్యాంప్ మరియు సాక్ట్ కనెక్టింగ్ టెయిల్ లైట్లు వంటి బ్లాక్ హైలైట్లతో ప్రీమియం రూపాన్ని మరింత పెంచడమే కాకుండా రోడ్డుపై భద్రంగా దూసుకెళుతుంది. అదనంగా, వినియోగదారులు ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా డీలర్షిప్లో బ్లాక్ స్టోమ్ చిహ్నాన్ని అమర్చవచ్చు.

దాని ఆకర్షణీయమైన బాహ్యాభాగంతో పాటు,ఎంజి హెక్టర్ బ్లాక్ స్టోమ్ ఆధునికత మరియు లగ్జరీని ప్రతిబింబించే గన్ మెటల్ స్వరాలుతో సంపూర్ణమైన బ్లాక్ థీమ్ ఇంటీరియర్ను కలిగి ఉంది. ఎస్యూవి భారతదేశపు అతిపెద్ద 35.56 సి.ఎం (14 అంగుళాల) హెచ్ డి పోర్ట్రెయిట్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ మరియు డ్యూయల్ సేన్ పనోరమిక్ సన్రూఫ్తో పాటు కన్సోల్ డ్యాష్ బోర్డులో గన్ మెటల్ గ్రే ఫినిష్‌ను కలిగి ఉంది. ఫ్రంట్ హెడ్స్‌లో బ్లాక్ స్టోమ్ డిబోబింగ్ తో కూడిన ఆల్-బ్లాక్ లెదర్ అహెూల్బరీ గన్‌మెటల్ ఫినిష్‌తో ఉన్న లెదర్ కవర్ చేయబడిన స్టీరింగ్ వీల్ దాని ప్రీమియం ఆకర్షణను మరింత మెరుగుపరుస్తుంది.

# భక్తి శ్రద్ధలతో ముస్లింల రంజాన్ వేడుకలు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు దీక్షలు విరమించి శనివారం నాడు రంజాన్ పర్వదినాన్ని అత్యంత వేడుకగా జరుపుకున్నారు. నియోజకవర్గంలోని యలమంచిలి మున్సిపాలిటీ, మండలం, రాంబిల్లి మండలంలో అత్యంత పవిత్రంగా జరుపుకున్నారు. యలమంచిలి పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పట్టణంలో నలు మూలలా ఉన్న ముస్లిం యువకులు, పెద్దలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత గురువులు వారికి ఖురాన్ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోదెపు గోవింద్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలు అందరూ నూతన వస్త్రాలు, శిరస్సుపై కుఫీ (టోపీ)లు ధరించి, సుగంధ పరిమళాలు వెదజల్లే అత్తర్లు పూసుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. దేశంలో శాంతి సౌభ్రాత్వాలు వెల్లివిరియాలని సర్వ మానవాళి సుఖ శాంతులతో విలసిల్లాలని కోరుతూ ప్రార్థనలు జరిపారు. అనంతరం వారికి మత గురువులు ఉర్దూలో ప్రసంగించారు. ఈద్గాలో ప్రార్థనలు పూర్తి చేసుకుని జామియా మసీదుకు చేరుకున్నారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం జామియా మసీదులో కూడా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ముస్లింలు అంతా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నమాజ్ అయిన తర్వాత రెహమత్ యూత్ కమిటీ అధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రార్థనలలో ముస్లిం పెద్దలతో పాటుగా రిటైర్డ్ హెడ్మాస్టర్ అబ్దుల్లా, యూత్ కమిటీ సభ్యులు ఎస్. కె. వల్లి, పీరు, బాష, అఖిబ్ జిలాని, ఖుఖారి, తౌషిప్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం కార్యాలయంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంటు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ సామాజిక సంస్కర్త సమాజంలోని అసమానతలు పోగొట్టడానికి అలాగే స్త్రీ పురుషుల మధ్య లింగ వివక్షత లేకుండా విశేషమైన కృషి చేశారని నాగ జగదీష్ అన్నారు. పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కేకేవిఏ నారాయణ రావు మాట్లాడుతూ పూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి గాను, బాల బాలికలకు పాఠశాలలో చదువుకోడానికి పాఠశాలలను ప్రారంభించారని, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అక్షర చైతన్యాన్ని నింపడానికి విశేషమైన కృషి చేశారని, దానికి ప్రజలు మహాత్మా అని బిరుదుని ఇచ్చారని నారాయణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కొణతాల వెంకటరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, గుడాల సత్యనారాయణ, విల్లూరి రమణబాబు, సబ్బిశెట్టి శ్రీనివాస్ యాదవ్, కాంద్రేగుల రవీంద్ర, బొడ్డేడ భాస్కరరావు, విల్లూరి సత్తి బాబు, కొణతాల బాబురావు, సూరిశెట్టి శివ, అప్పారావు, కల్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# 'వరల్డ్ వైడ్ ఆంగ్లికన్ చర్చి' కోసం బిషప్‌లు పాటుపడాలి



**విజయనగరం:** ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా ఎస్.కోటలో ఇంటర్నేషనల్ ఎక్యుమినికల్ హౌస్ ఆఫ్ బిషప్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కాన్ఫరెన్స్ తెలుగు రాష్ట్రాల నుండి 40 మంది బిషప్‌లు, డిప్యూటీ మోడరేటర్లు మరియు ఆర్చ్ బిషప్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రైమేట్ ఆర్చ్ బిషప్ ఫర్ సదరన్ ఆసియా సంస్థ అధినేత డా॥ సి.విజయ్ మోహన్ రావు ప్రపంచవ్యాప్త ఆంగ్లికన్ చర్చి గురించి మాట్లాడుతూ, ఈ సంస్థ 1549లో స్థాపించబడిందని, మరియు ఆర్థడాక్స్ చర్చి నుండి బయటకు వచ్చి 1921 సంవత్సరంలో WACగా స్థాపించబడిందని తెలిపారు. ఇందుకు ఆర్చ్ బిషప్ సెయింట్ పీటర్స్ పాట్రియార్క్‌గా చాలా కృషి చేశారు. ఆయనతో పాటు. చాలా మంది నాయకత్వం వహించారన్నారు. 2017 సంవత్సరంలో WAC క్రిస్టోఫర్ లవంగా ట్రూసిబ్రా, ఉగాండా, అనేక అభివృద్ధి సంఘాల నుండి పితృస్వామ్య నియమితులయ్యారు. ఈ సమావేశంలో ఆర్చ్ బిషప్. బిషప్‌లకు పాట్రియార్క్ డాక్టర్ క్రిస్టోఫర్ లవంగా ట్రుసిబ్రా శుభాకాంక్షలు తెలుపడామీ కాకుండా దిశానిర్దేశం చేశారు. WAC సంస్థ ద్వారా 2017 నుండి దక్షిణాసియాకు సేవలందిస్తున్న సీనియర్ ప్రైమేట్ ఆర్చ్ బిషప్ డాక్టర్ చి.విజయ్ మోహన్ రావు. జాన్, యుఎస్ఏ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న WAC అని మరియు బిషప్‌లను అభినందించారు. ఈ సమావేశంలో బిషప్‌లందరూ మాట్లాడారు. ముఖ్యంగా, ఈ సమావేశం సీనియర్ డిప్యూటీ మోడరేటర్ & సైనాడ్ అధ్యక్షుడు బిషప్ డా॥ దేవప్రసాద్ నేతృత్వంలో జరిగింది. విజయనగరం బిషప్‌లు, బెంజమిన్, శరత్ కుమార్, విజయ్ డేనియల్, ప్రసాద రావు, అద్భుతంగా చేయగలిగారు. దక్షిణాఫ్రికా దేశాలకు ఆర్థికంగా సహాయం చేయడానికి మరియు దక్షిణాఫ్రికా దేశాలకు సహాయం చేయడానికి అందరూ అంగీకరించారు. బిషప్ డాక్టర్ మహేష్ పాల్, పీటర్ నాయక్, టైటస్ నిర్మల కుమార్, వీర్లభాస్కర్ అందరూ మాట్లాడారు. సైనాడ్ సెక్రటరీ బిషప్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అందరూ కలిసి సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. డా॥ ప్రకాశరావు మరియు బిషప్ డా॥ ఎం.ఎస్. దయానంద్ మాట్లాడారు. ఈ సమావేశంలో, ప్రైమేట్ ఆర్చ్ బిషప్ దక్షిణాసియా డా॥ సి.హెచ్. విజయ మోహన్ రావు ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లికన్ చర్చి, భారతదేశంలో WAC విస్తరణ గురించి పునాది రాళ్లను ఆవిష్కరించారు మరియు దక్షిణాసియాలో wac విస్తరణ గురించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

# పూలే స్ఫూర్తితో అసమానతలు రూపుమాపుదాం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మహాత్మ జ్యోతిరావు పూలే అదర్శాలను అచరిస్తూ సమాజంలో మిగిలి ఉన్న అసమానతులు రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతిరావు పూలే 198వ జయంతోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పూలే చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితమే సమాజం ప్రగతి పదంలో పయనించాలంటే బాలికలకు విద్య అవసరమని గుర్తించి పూలే మహిళలకు పాఠశాల ప్రారంభించారని చెప్పారు. అట్టడుగు వర్గాల వారిలో చైతన్యం తీసుకువచ్చి సమాన హక్కుల కోసం పోరాడారన్నారు.

వారి అడుగుజాడల్లో మనమంతా నడవాలన్నారు. వర్ణ వివక్ష లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేశారన్నారు. ఆయన కృషి వలననే ఈనాడు బాలికలు చదువుకోగలుగుతున్నారన్నారు. స్త్రీలకు పురుషులతో సమాన హక్కులు కల్పించడం, మహిళా సాధికారతకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే. రాజేశ్వరి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి లో రంజాన్ వేడుకలు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి, తగరపు వలసలో ముస్లిమ్ సోదరులు గురువారం రంజాన్ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భం గా స్థానిక జామియా మసీదు ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు రంజాన్ ప్రార్థనలు చేసారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో ఇమామ్ ఎండి నసీమ్ అక్తర్, మసీదు పెద్దలు షేక్ అన్వర్ హుస్సేన్, షేక్ అబ్దుల్ నయీమ్, షేక్ అబ్దుల్ మతీన్, షేక్ అబ్దుల్ ఘని మర్కియర్, షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గెలుపుతో రాష్ట్రాభివృద్ధి - పార్టీ అభ్యర్థులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో ప్రకటించిన గ్యారెంటీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం రానుందని విశాఖ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి పులుసు సత్యారెడ్డి తెలిపారు. విశాఖలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొంపా గోవిందరాజు ఆధ్వర్యంలో విశాఖ పార్లమెంట్ అభ్యర్థి పులుసు సత్యనారాయణ రెడ్డి, విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గుత్తుల శ్రీనివాసరావు, దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి సంతోష్, గాజువాక అభ్యర్థి లక్కరాజు రామారావు, భీమిలి నియోజకవర్గ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మ రాజులతో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పులుసు సత్యారెడ్డి మాట్లాడుతూ తనమీద నమ్మకంతో విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపిక చేసిన అధిష్టానానికి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఎంపీగా గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రవేటీకరణ కాకుండా అడ్డుకుంటానన్నారు. పోలవరం ప్రాజెక్ట్, విశాఖ రైల్వే జోన్ తదితర అంశాలపై పోరాటం చేస్తానన్నారు. విశాఖ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

విశాఖ తూర్పు నియోజక వర్గ అభ్యర్థి గుత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ తూర్పు నియోజక వర్గంలో కేవలం రెండు సామాజిక వర్గాలు మాత్రమే ఉన్నట్లు ప్రధాన రాజకీయ పార్టీలు భావిస్తున్నాయన్నారు. టీడీపీ, వైస్సార్ సీపీ ల్లో దేనికి ఓటు వేసినా బిజెపికి గుర్తుకు ఓటేసినట్లేనన్నారు. బలహీన వర్గానికి చెందిన తనను గెలిపిస్తే హనుమంతవాక దగ్గర తక్షణమే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషిచేస్తానన్నారు. బిసి వర్గానికి చెందిన తాను వెనుకబడిన తరగతుల వారికి సంపూర్ణ న్యాయం చేస్తానని చెప్పారు. అభివృద్ధికి మారుపేరైన తూర్పు నియోజక వర్గంలో పేరుకుపోయిన దీర్ఘకాల సమస్యలన్నిటినీ పరిష్కరిస్తానని గుత్తుల శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.

సీనియర్ నాయకుడు కొయ్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ డెబ్బైఏదేళ్ళ కాంగ్రెస్ పాలనలో ప్రజలు సుఖశాంతులతో జీవించారన్నారు. సిబిఐ, ఈడీ లను ప్రక్కన పెట్టుకుని బీజేపీ సాగిస్తున్న అరాచక పాలన అంతమొందించడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. విశాఖ ఉక్కు ప్రవేటీకరణపై సత్యాగ్రహం పేరుతో సినిమా నిర్మించిన పోరాటయోధుడు సత్యారెడ్డిని విశాఖ పార్లమెంట్‌కు పంపితే విశాఖ సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

అభ్యర్థులందరం స్థానికులేనని, నిత్యం ప్రజలతో మమేకమైన నాయకులని, ఓటర్లు విజ్ఞతతో అలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి సంతోష్ మాట్లాడుతూ దక్షిణ నియోజక వర్గంలో పదేళ్లుగా ఎమ్మెల్యే పనిచేసిన వాసుపల్లి గణేష్ కుమార్ వల్ల మత్స్యకారులకు ఒరిగిందేమి లేదన్నారు. తన ఆస్తులను కాపాడుకోవడానికే వైస్సార్ సీపీలో చేరి ప్రజలను మోసగించిన వాసుపల్లిని ఇంటికి పంపడానికి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇతర ప్రాంతం నుంచి దిగుమతైన వంశీని ప్రజలు నమ్మరన్నారు. రంగా బిల్లాలవంటి వంశీ, గణేష్ కుమార్‌లకు తగిన బుద్ధి చెప్పాలని సంతోష్ పిలుపునిచ్చారు. సాధారణ మత్యకార కుటుంబానికి చెందిన తాను దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్సుమెంట్‌తో తాను విద్యనభ్యసించానని స్థానికుడినైనా తనను గెలిపిస్తే నియోజకవర్గంలో ప్రధానమైన కాలుష్య సమస్యపై పోరాడతానని, మత్స్యకారులకు అండగా నిలుస్తానని తెలిపారు. గాజువాక అభ్యర్థి లక్కరాజు రామారావు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా యువజన కాంగ్రెస్ నాయకునిగా పని చేసిన తనకు అధిష్టానం గుర్తించి టికెట్ కేటాయించడం గర్వకారణంగా ఉందన్నారు. స్థానికుడిగా ఉక్కు నిర్వాసిత ఉద్యమాల్లో ఎన్నో పోరాటాలు చేసిన తనను గెలిపిస్తే స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణ, గంగవరం పోర్టు, హౌస్ కమిటీ సమస్యలపై పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. భీమిలి నియోజకవర్గ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మరాజు మాట్లాడుతూ టీడీపీ,వైస్సార్ సీపీలు స్థానికులను కాదని వలస నాయకులకు టికెట్‌లు కేటాయించారని, స్థానికుడిగా అన్ని సమస్యలపై అవగాహన కలిగిన తనను గెలిపిస్తే నియోజక అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. తనను నమ్మి టికెట్ కేటాయించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో మార్పు కనిపిస్తోందని కాంగ్రెస్ గెలుపు ఖాయమని వర్మరాజు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గంప గోవింద రాజులు అధ్యకతన జరిగిన సమావేశంలో సీనియర్ నాయకులు కమలాకర్, కాకినాడ చినబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు సీఎం రమేష్, కొణతాల రంజాన్ శుభాకాంక్షలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నేడు ఈదే ఉల్ ఫితర్ (రంజాన్) సందర్భంగా ముస్లిం సోదరులకు బీజేపీ, టీడీపీ, జనసేన బలపరచిన అనకాపల్లి ఎంపి అభ్యర్థి సీఎం రమేష్ శుభాకాంక్షలు తెలియజేసారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా పాటించిన రంజాన్ మాస ఉపవాసం దీక్షలు బుదవారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించడంతో ముగిశాయన్నారు. ముస్లింలు అందరూ చాంద్ ముబారక్ అంటూ సంబరాలు చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ఎన్ డీ ఏ కూటమి విజయంతో దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమతుల్యంగా ప్రజలకు అందుబాట్లో ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ డీ ఏ కూటమి అభ్యర్థులను అత్యంత మెజారిటీతో గెలిపించాలని సీఎం రమేష్ కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి జనసేన నేత కొణతాల రామకృష్ణ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులకు ఉమ్మడి అభ్యర్థులు మిఠాయిలు తినిపించారు.

# ముస్లిం జర్నలిస్టులకు రంజాన్ తోఫా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలు చేసిన అనంతరం జరుపుకునే పండుగ రంజాన్. అందరి జీవితాల్లో మరింత వెలుగులు నింపాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, విశాఖ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కోరారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం అక్కయ్యపాలెంలోని కార్యాలయం వద్ద విశాఖ నగరంలో ఉన్న 15 మంది ముస్లిం జర్నలిస్టులకు రంజాన్ తోఫా పేరిట నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి క్రమం తప్పకుండా ముస్లిం జర్నలిస్టు సోదరులకు రంజాన్ తోఫా అందిస్తున్నామని, దీనిలో భాగంగానే ఈ ఏడాది కూడా అందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ రంజాన్ పర్వదినాన్ని బాగా జరుపుకోవాలని అందరూ బాగుండాలని, అందులో మనం ఉండాలని ఆకాంక్షతో పని చేస్తున్నట్లు తెలిపారు. ముస్లిం జర్నలిస్టు సోదరులకు ఏ సమస్య వచ్చినా అన్ని విధాల అండగా నిలుస్తానని ఆయన తెలిపారు.

# ముస్లింల ఆదరాభిమానాలే ఈ స్థాయిలో ఉంచాయి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దక్షిణ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ రంజాన్ సందర్భంగా జరిగిన నమాజ్‌కి హాజరయ్యారు. ముందుగా నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు ముజీబ్ ఖాన్ తదితరులు శాలువా కప్పి స్వాగతం పలికారు. వన్ టౌన్ ప్రాంతంలో గురువారం అంబుసారంగ్ వీధి ఈద్‌గా వద్ద జరిగిన నమాజ్‌లో ఆయనతో పాటు దక్షిణం నియోజకవర్గం పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ముస్లిం సోదరులందరికీ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. వన్‌టౌన్ ప్రాంతంలో స్థానికుడిగా వారితో ఎక్కువ సత్సంబంధాలు ఉన్నాయన్నారు. మసీదు నిర్మాణంలో తాను కూడా ఒక కూలీగా పని చేశానన్నారు. తను ఈ స్థాయిలో ఉండడానికి ముస్లిం సోదరుల ఆదరభిమానాలే కారణమన్నారు. ముస్లిం సోదరులందరూ పవిత్ర రంజాన్ మాసంలో చిన్న పెద్ద తేడా లేకుండా మహిళలతో పాటు అందరూ కూడా 30 రోజులు కఠిన ఉపవాసాలు ఉంటారని అలాగే ప్రతిరోజు మసీదులో నమాజ్ చదువుతారన్నారు. వారికి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుదలకు ముస్లింల పక్షాన ఎప్పుడూ వైసిపి అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ముస్లింల గురించి ఆలోచించి వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేయడం గొప్ప విషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ జహీర్ అహ్మద్, అప్సర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం గొర్లివానిపాలెం బీసీ కాలనీలో గురువారం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు జ్యోతిరావు పూలే కృషి చేసాడు. 1873 సెప్టెంబరు 24న, పూలే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్)ను ఏర్పాటు చేశాడు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరవచ్చు. లాగ్రేంజ్‌లోని సామాజిక సంస్కరణ ఉద్యమంలో పులే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డాడు. అతను, అతని భార్య సావిత్రిబాయి పులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు. అతను మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందాడు. పులే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించాడు. అతను వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులలో ఈ జంట ఉన్నారు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఆయనే. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ప్రజల హక్కుల పై జరుగుతున్న దాడులను ఎదుర్కోవటానికి ఉద్యమించాలన్నారు. బిజేపి అధికారం చేపట్టిన తరువాత దేశంలో అణగారిన ప్రజల హక్కుల పై దాడులు పెరిగాయి అన్నారు. రాజ్యాంగాన్ని ద్వ్వంసంచేసే బిజేపికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏ వరలక్ష్మి, సిహెచ్ వరాలమ్మ, ఏ అన్నపూర్ణ, పుష్ప, అనిత, లక్ష్మి ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీలోకి భారీగా చేరికలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి మండలం, తుమ్మపాల గ్రామంలో వైఎస్ఆర్సిపి విస్తృత సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, రైతు సంఘం ప్రెసిడెంట్ పీలా బుజ్జి ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలపర్తి శ్రీను, రాష్ట్ర ఓబీసీ సెక్రెటరీ అలమండ శ్రీను, బిసి స్టేట్ సెక్రటరీ నీలగిరి వరహాలు, ఏడిద మహేష్, పిజి నూకరాజు, టిడిపి నాయకులు కొణతాల శ్రీను, సదరం నూకరాజు, పీలా శ్రీను, రామిరెడ్డి, చదరం పోలిశెట్టి తదితరులు సుమారు 50 మందికి పైగా అనకాపల్లి నియోజకవర్గ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సమక్షంలో వైఎస్ఆర్సీపీలో చేరారు. వారికి అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బిశెట్టి సత్యవతి, అనకాపల్లి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ విధానాలు నచ్చి, ఈ పార్టీలో కార్యకర్తలకు నాయకులకు ఇస్తున్న గౌరవాన్ని చూసి ఈ పార్టీలో చేరుతున్నామని తెలియజేశారు. భరత్ మాట్లాడుతూ అనకాపల్లిలో తన విజయానికి, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి విజయానికి సహకరించాలనివిజ్ఞప్తి చేశారు.

## పార్టీలోకి ఆహ్వానించిన మలసాల భరత్ కుమార్



ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ వీల్లూరి సూర్యకుమారి శేఖర్, అన్నపూర్ణ బ్యాంక్ పూర్వపు చైర్మన్ గాంధీ, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, ఎంపీటీసీలు పంచదారల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వడ్డాది అశోక్ భారతి, పాల సంఘం ప్రెసిడెంట్ సూరిశెట్టి శ్రీను, వైసిపి నాయకులు పడాల గణపతి, ఏరుబండి సత్యనారాయణ, ముదిరెడ్డి దేవుడి బాబు, కొణతాల శివాజీ, మెగసాల వెంకట్, గొంతున శీను తదితరులు పాల్గొన్నారు.

# అభ్యంతరాలన్నీ పరిశీలిస్తాం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాజకీయ పార్టీల నుండి వచ్చిన అభ్యంతరాలన్ని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభ్యంతరాలను ఆధారపూర్వకంగా సమర్పించాలన్నారు. మార్చి 16వ తేదీ వరకు ఉన్న సప్లిమెంటరీ ఓటర్ల జాబితా ఏప్రిల్ 25వ తేదీన అందజేస్తామన్నారు. ఈ నెల 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ, 29వతేదీ వరకు ఉప సంహరణ ఉంటుందని వివరించారు. అన్ని అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఈవీఎంలపై కమిషనింగ్ ఉంటుందన్నారు. తరువాత ఎవీఎంల రాండమైజేషన్ జరుగుతుందన్నారు. వీటికి అన్ని పార్టీలు వారి ఏజెంట్లను పంపిచాలన్నారు. పార్లమెంట్ ఏఆర్ఓఐన జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల సౌకర్యకేంద్రం నిర్వహించబడుతుందన్నారు. లివోటర్ గైడ్‌లి అనే కరపత్రాన్ని విడుదల చేయడం జరిగిందని, దానిలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటరుగా నమోదవడం, దివ్యాంగులకు, 85 సం॥లు దాటినవారికి వోటు వేసేందుకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఎన్నికలు, పార్టీలు, ఓటింగ్ చేయడం పై పూర్తి అవగాహన వుంటుందని వివరించారు. నామినేషన్లకు ముందు ఇంటింటి ప్రచారానికి ఎటువంటి ఆంక్షలు లేవని, శాంతి భద్రతల దృష్ట్యా స్టేషన్ హౌస్ అధికారికి సమాచారం ఇవ్వాలని, ఎన్నికల నిబంధనలకు తప్పక పాటించవలసి వుంటుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.దయానిధి, డి.యం.అండ్ హెచ్ వో డాక్టర్ ఏ హేమంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, డి.టి. రవి కుమార్, వివిధ పార్టీల నాయకులు మాజీ ఎమ్మెల్సీ బి.నాగ జగదీశ్వరరావు (తెలుగుదేశం), ఎంపీపీ గొర్లె సూరిబాబు (వై.సి.పి), డి.పరమేశ్వర రావు (బిజెపి), అల్లు రాజు (సిపియం), డి.సంతోష్ (కాంగ్రెస్), కె.హరనాథబాబు (ఆమ్‌ఆద్మీ), జి. చిన్నారావు (బిఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న గిరిపుత్రులు

## 43 మంది గ్రూపు -2 మెయిన్స్ పరీక్షకు అర్హత



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** వివిధ పోటీ పరీక్షలలో గిరిజన యువత సత్తాచాటుతున్నారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ నిర్వహించిన గ్రూపు-1. గ్రూపు -2 పరీక్షలలో గిరిజన యువత మరోసారి ప్రతిభ కనబరిచి విజయాలు సాధిస్తున్నారు. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ గత ఏడాది నవంబరు నెలలో ప్రాజెక్టు లక్ష్య పేరుతో నిరుద్యోగ గిరిజన యువతకు వేపగుంట వైటిసిలో అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి సివిల్స్ ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఐటిడి ఏ సౌజన్యంతో రాజమండ్రి 21వ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 64 మంది గిరిజన యువతీ, యువకులకు సివిల్స్, గ్రూప్ 1, గ్రూప్ -2, పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నారు. ఉత్తమ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో అవసరమైన కోచింగ్ అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఈ నెల 10 వ తేదీన విడుదల చేసిన గ్రూపు -2 ప్రిలిమినరీ పరీక్షలకు 59 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 43 మంది గ్రూపు -2 మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. గత ఏడాది నిర్వహించిన గ్రూపు 1లో చిట్టపులి జీవన, నవ్యసాయి గౌరి ఐటిడిఏ శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించడం విధితమే.

ఐటిడిఏ నేతృత్వంలో వేపగుంట వైటిసిలో ఉచితంగా గిరిజన యువతీ, యువకులకు సివిల్స్ శిక్షణ అందిస్తున్నాము. 21వ సెంచరీ ఆధ్వర్యంలో శిక్షణ పొంది పలువురు ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నారు. ఆదే స్ఫూర్తితో 2023 నవంబరులో రెండవ సారి సివిల్ ఉచిత శిక్షణను ప్రారంభించాము. సివిల్స్ ఉచిత శిక్షణను 9 నెలలు కొనసాగిస్తాము. గిరిజన యువత ఐ.ఏ.ఎస్, ఐ.పి. ఎస్, ఐ. ఎఫ్. ఎస్, ఇతర సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించే విధంగా ఉత్తమ శిక్షణ అందిస్తున్నాము. 21వ సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీ అంకిత భావంతో కోచింగ్ అందిస్తున్నారు. తాను స్వయంగా పర్యవేక్షించడం క్లాసులు చెప్పడం గిరిజన యువతను పోటీ పరీక్షలపై చైతన్యవంతం చేస్తున్నాము అన్నారు.

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ అందిస్తున్న ప్రోత్సాహంతో గిరిజన యువతకు సివిల్స్ శిక్షణ అందించడం జరుగుతోంది. సివిల్స్ శిక్షణలో అనుభవం కలిగిన ఫ్యాకల్టీలతో అన్ని పోటీ పరిక్షలకు ఉపయోగపడే విధంగా తర్ఫీదు అందిస్తున్నాము. గిరిజన యువత ఉన్నత ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా నిరంతరం పర్యవేక్షణతో పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాము.

ఏపీపిఎస్సీ వచ్చే జూలై 28న నిర్వహించనున్న గ్రూప్ -2 మెయిన్స్‌కు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నాము. అదే విధంగా వైటీసిలో శిక్షణ పొందుతున్న వారందరూ గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలు రాసారు. త్వరలో ఫలితాలు వెల్లడవుతాయి. వాటిలో సైతం గిరిజన యువతీ, యువకులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు.


మెగా బ్రాహ్మణ వివాహ వేదిక
తెలుగు బ్రాహ్మణ వధూవరుల
వివాహ పరిచయ కార్యక్రమం
విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం
9-3-16, పిఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 21-04-2024, (ఆదివారం)
సమయం : మధ్యాహ్నం గం. 3.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.
శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...
రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు
జనహిత మ్యాట్రిమోనీ
9393949345, 8074541283
Compli


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676